


పాములేరులో ఇద్దరు గల్లంతు!
విషాదం మిగిల్చిన విహారయాత్ర
7

నీట్.. కొట్టారు!

నీట్ 2025 ఫలితాలు విడుదలయ్యాయి.. ఐఐటీ అండ్ మెడికల్ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు.. తిరుమల విద్యార్థి దర్భా కార్తీక్ రామ్‌కిరీటి ఆలిండియా 19వ ర్యాంక్, స్టేట్ 1వ ర్యాంక్ సాధించాడు. చాగల్లుకు చెందిన కొడవటి మోహిత్ శ్రీరామ్ ఆలిండియా స్థాయిలో 56వ ర్యాంకు.. రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్ సాధించాడు. ఇలా పలువురు విద్యార్థులు మెరిశారు. నీట్‌ను సాధించారు. ఎంబీబీఎస్ చదవాలనే తమ కలను నిజం చేసుకున్నారు. తల్లిదండ్రుల ఆశకు ఊపిరి లూదారు. పలువురు ఐఐటీలో సీటు సాధించారు.

అమ్మానాన్న కష్టం చూసి చదివా..



నా పేరు కొడవటి మోహిత్ శ్రీరామ్.. మాది చాగల్లు..నాన్న సత్యనారాయణ, తల్లి నవీన.. మాది వ్యవసాయ కుటుంబం.. నన్ను ఉన్నత స్థానంలో చూడాలనే కష్టపడి చదివించారు. వారి కష్టానికి విలువ ఇవ్వాలని కదా.. ఆ కష్టమే నన్ను బాగా చదివేలా చేసింది. శనివారం విడుద లైన నీట్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 56వ ర్యాంకు రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకు సాధించా. గతంలో ప్రకటించిన ఏపీఈఏపీ సెట్‌లో 9వ ర్యాంకు సాధించా. డాక్టర్ కావాలనే నా కల నిజం చేసుకుంటున్నా.

- కొడవటి మోహిత్ శ్రీరామ్, చాగల్లు

ప్రతి ఒక్కరి జీవితంలో అమ్మ కనిపించే దైవమైతే.. నాన్న కనిపించే ధైర్యం.. జీవితంలో తప్పటడుగు వేయకుండా.. తడబడకుండా కాచుకొంటూ.. వేలు పట్టి అడుగులు నేర్పించి.. నేనున్నాను రా! అనే భరోసా నాన్న. అమ్మ ప్రేమకు ప్రతి రూపమైతే.. నాన్న ప్రతి క్షణం నడిపించే బాధ్యత. ఓడినప్పుడు భుజం తట్టి.. గెలిచినప్పుడు పది మందికి చెప్పుకొని మురిసిపోయే వాడు నాన్న. బయటకు కఠినం.. లోపల మాత్రం బిడ్డల గురించి భయపడేవాడే నాన్న. పిల్లలు కష్టపడకూడదని తన ఇష్టాలను కూడా చిరునవ్వుతో మరిచిపోయేవాడు నాన్న. అడుగులు నేర్పిన చిటికిన వేలు నాన్నదే.. బుడిబుడి పాదాలతో తన్నుతూ ఆడుకున్న గుండెలు నాన్నవే.. చాలామంది జీవిత కథల్లో సూపర్ హీరో నాన్నే. నేడు అంతర్జాతీయ పితృ దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న 'పితృదేవోభవ'..



నాన్నకు ప్రేమతో..

నేడు ఫాదర్స్ డే
ప్రత్యేక కథనం
7 లో



పట్టు పట్టారు!
ఉప్పాడ టు చేనేతకు టు చేయూత

- ఇన్నేళ్లకు మంచి రోజులు
- 15 చోట్ల చేనేత క్లస్టర్లు
- రూ.15 కోట్లతో ప్రతిపాదనలు
- త్వరలో నిధుల విడుదల
- ప్రాజెక్టుపై పవన్ సంప్రదింపులు
- నేతన్నలకు ఆధునిక శిక్షణ
- మారనున్న పిఠాపురం చిత్రం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉప్పాడ అంటే చేనేత..రంగురంగుల చీరలు.. మోడళ్లు.. వీటిపై మనసుపారేసుకోని మహిళలంటూ ఉండరు.. ఎక్కడో హైదరాబాద్, విశాఖ నుంచి ఎందరో ప్రముఖులు ఇక్కడకు వచ్చి చీరలు కొనుగోలు చేస్తారు. సినీ సెలబ్రిటీలు సైతం తమ ఇళ్లల్లో వివాహాలు, ఇతర శుభ కార్యాలకు ఇక్కడి నుంచే చీరలు తీసుకెళతారు. ఏటా రూ.30 కోట్ల వరకు జరిగే ఈ వ్యాపారానికి ప్రోత్సాహం అందిస్తే చేనేత వ్యాపారం ఎదిగే అవకాశం ఉంది. అటు చేనేత కార్మికులకు సైతం మేలు జరగనుంది. ఈ నేపథ్యంలో ఉప్పాడ చేనేతకు మరింత చేయూత నందించి ఆధునిక డిజైన్లలో చీరలు తయారు చేసేలా ప్రభుత్వం తోడ్పాటు అందించబోతోంది. ఈ మేరకు రూ.15 కోట్లతో చేనేత అభివృద్ధి క్లస్టర్ ఏర్పాటుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. తన సొంత నియోజకవర్గం కావడంతో పవన్ సైతం కేంద్రంతో మాట్లాడుతున్నారు. త్వరలో నిధులు విడుదలయ్యే అవకాశం ఉన్నట్టు చేనేత శాఖ అధికారులు చెబుతున్నారు.

1600 కుటుంబాలకు ఆధారం

ఉప్పాడ అంటే చేనేత చీరలకు ప్రసిద్ధి. చెన్నై నుంచి మేలురకం నూలు తీసుకు వచ్చి ఇక్కడ మగ్గాలపై నేత కార్మికులు రక రకాల చీరలు నేస్తారు.ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మంచి పేరుంది. ఉప్పాడ, పిఠాపురం, గొల్లప్రోలులో దాదాపు 1600 చేనేత కుటుంబాలు ఉండగా వీరిలో అనేక మంది పట్టు, జాంధానీ చీరలను మగ్గాలపై నేస్తారు. ఉప్పాడలో రెండు చేనేత సంఘాలు వీటిని తయా రుచేసి విక్రయిస్తాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కొత్తగా చేనేత ప్రోత్సాహానికి పథకం ప్రారంభించింది. నీడ్ బేస్డ్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ ప్రాజెక్టు కింద ఉప్పాడ చేనేత క్లస్టర్ ప్రాజెక్టును ప్రతిపాదించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అటు పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ అయినందున ఇక్కడ చేనేతను మరింత ప్రోత్సహించాలని పట్టుదలగా ఉన్నారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ప్రత్యేక ఆసక్తి కనబర్చి కేంద్రానికి ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించారు.ఈ మేరకు ఉప్పాడలో 916 మంది ఇళ్లకు నేరుగా వెళ్లి ఇటీవల చేనేతశాఖ అధికారులు అభిప్రాయాలు సేకరించారు. మొత్తం రూ.15 కోట్ల ప్రాజెక్టుకు సంబంధించి కేంద్రం వాటాగా రూ.11.85 కోట్లు ఇవ్వనుంది. మిగిలిన రూ.3.15 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది. ఇటీవల రాష్ట్ర చేనేత కమిషనర్ రేఖారాణి ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్ర చేనేత శాఖకు పంపించారు. ఈ ప్రాజెక్టుపై పవన్ సైతం కేంద్రంతో మాట్లాడుతున్నారు. త్వరలో నిధులు విడుదల కానున్నాయని కాకినాడ కలెక్టర్ వివరించారు.

ఇలా చేస్తారు..

ప్రాజెక్టు అభివృద్ధి కింద పిఠాపురం నియోజకవర్గంలో 15 చోట్ల చేనేతను ప్రోత్సహించడానికి పలు అంశాలు ప్రతిపాదించారు. ఉప్పాడలో రూ.1.40 కోట్లతో పనులు చేయబోతున్నారు. రూ.80 లక్షలతో క్వాలిటీ టెస్టింగ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. రూ.60 లక్షలతో మెగా షోరూం ఏర్పాటు చేసి చీరలు విక్రయిస్తారు. యు.కొత్తపల్లిలో రూ.కోటితో డిజైన్ స్టూడియో నిర్మిస్తారు. రూ.80 లక్షలతో చీరలు, జాకెట్లు, ఇతర వస్త్రాలు కుట్టేలా యూనిట్ నిర్మించనున్నారు.తాటిపర్తిలో రూ.55 లక్షలతో శారీ స్క్రీన్ పెయింటింగ్ సెంటర్ నిర్మించనున్నారు. రూ.50 లక్షలతో షోరూం నిర్మిస్తారు. రూ.60 లక్షలతో షాప్ అండ్ షాప్ కింద పాడుబడ్డ చేనేత సంఘం భవనాలు ఆధునికీకరిస్తారు. చేబ్రోలులో నూలుకు రంగులు అద్దే యూనిట్ రూ.2.50 కోట్లతో ఏర్పాటు చేయనున్నారు. రూ.50 లక్షలతో షోరూం కట్టనున్నారు. దుర్గాడలో రూ.80 లక్షలతో గార్మెంట్ మేకింగ్ యూనిట్ స్థాపించాలని ప్రతిపాదించారు. చెందుర్తిలో రూ.55 లక్షలతో శారీ స్క్రీన్ ప్రింటింగ్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. గొల్లప్రోలులో రూ.50 లక్షలతో హోం ఫర్నీషింగ్ యూనిట్ స్థాపించనున్నారు. మొత్తం రూ.12 కోట్లతో చేనేతకు సంబంధించి ఆధునిక మోడళ్లలో చీరలు, జాకెట్లు డిజైన్ చేయడం, రక రకాల స్క్రీన్ ప్రింటింగ్‌లు అందుబాటులోకి తేనున్నారు. రూ.1.50 కోట్లతో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి జిల్లాలో చేనేత కార్మికులు, మహిళలకు ఆధునిక మోడళ్లపై శిక్షణ ఇస్తారు. దేశంలో ప్రముఖ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (ఎన్ఐఎఫ్‌టీ)ల నుంచి ప్రముఖ డిజైనర్లను ఉప్పాడ తీసుకు వస్తారు. నిపుణులతో రెండేళ్లపాటు శిక్షణ ఇప్పించనున్నారు. ఇందుకు రూ.3 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేశారు.



బై..బై.. వైసీపీ!
కూటమి వైపు.. ఫ్యాన్స్ చూపు

- పార్టీ మారేందుకు నేతలు సిద్ధం
- క్యూ కడుతున్న వైసీపీ నాయకులు
- అయినా అంగీకరించని టీడీపీ
- ఆమోదం తరువాతే చేరికలు
- సీఎం చంద్రబాబు వర్తమానం
- డిసెంబరులోనే స్థానిక ఎన్నికలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ప్రతిపక్ష వైసీపీ రెక్కలూడిపోతున్నాయి. ఇప్పటికే ఒక్కొక్కరుగా పార్టీ మారిపోతున్నారు. అవకాశమిస్తే క్యూకట్టేలా ఉన్నారు. వైసీపీ తన వైఖరి వల్లే ప్రజల్లో మరింత వ్యతిరేకత తెచ్చుకుంటోంది. ఇటీవల అమరావతిపై సొంత ఛానల్‌లో అక్కసు వెళ్లగక్కడమే అందుకు ఉదాహరణ. అమరావతి రాజధానిపై సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కృష్ణంరాజు అనే జర్నలిస్ట్ చేసి వ్యాఖ్య తీవ్ర పరిణామాలకు దారి తీసిన సంగతి తెలిసిందే. గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు నేతలు చేసిన పనులు, కొందరు కార్యకర్తలు, అధినేత జగన్ వ్యవహార శైలి ఆ పార్టీకి తీవ్ర నష్టం తెచ్చిన సంగతి తెలిసిందే. దీంతో గత సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వైసీపీ తుడుచుపెట్టుకుపోయింది. ఇటీవల జరిగిన టీచర్స్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ వైసీపీ ఊసే వినిపించలేదు. దీంతో నేతలతోపాటు, కార్యకర్తలు దిగాలు పడుతున్నారు. దీనికితోడు స్థానిక సంస్థలైన పంచాయతీలు, మునిసిపాలిటీలు, జడ్పీల్లోనూ ఉన్న వైసీపీ ప్రతినిధులు నెమ్మదిగా జారుకుం టున్నారు. ఇప్పటికే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని పలువురు జడ్పీటీసీలు, సర్పంచ్‌లు కూటమిలో చేరారు. పిఠాపురంలో వైసీపీ నేత జనసేనలో చేరిపోయారు. తుని మునిసి పాలిటీ టీడీపీ వశమైంది. కొవ్వూరు మునిసిపల్ చైర్మన్ వైసీపీకి రాజీనామా చేశారు. టీడీపీలో చేరనున్నారు. నిడదవోలు మునిసిపాలిటీ జనసేనకు దక్కింది. ఇంకా అనేక మంది పార్టీ మారాలని చూస్తున్నా ఇటు ఆమోదం లభించడంలేదు.

వస్తామన్నా.. వద్దు : చంద్రబాబు

ఇటీవల టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ ఎమ్మెల్యేలకు ఒక వర్తమానం పంపారు. వైసీపీ నుంచి వచ్చే వారిని ఇష్టానుసారం పార్టీలో చేర్చుకోవద్దని.. ముందు తమకు సమాచారం ఇచ్చి.. ఆమోదం పొందిన తర్వాతే చేర్చుకోవాలని చెప్పడం గమనార్హం. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ కూడా ఈ విషయాన్ని బహిరంగంగానే ప్రకటించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో చాలామంది వైసీపీ నేతలు కూటమిలో చేరడానికి ప్రయత్నాలు చేస్తున్నా రెడ్ సిగ్నల్ ఉంది. పైగా ఎమ్మెల్యేలకు ఆయా మునిసిపాలిటీలు, స్థానిక సంస్థల్లో అక్రమాలకు పాల్పడి ప్రజల్లో చెడ్డపేరు తెచ్చుకున్నవారిని చేర్చుకోవడానికి ఇష్టపడడం లేదు. కొందరు వస్తామన్నా వద్దని చెబుతున్నారు. ఇతరులను లాక్కోవడానికి ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. వచ్చే ఏడాది వరకూ స్థానిక సంస్థల ఎన్నికలకు గడువు ఉంది. కానీ నాలుగేళ్లు పూర్తవడంతో మునిసిపల్ చైర్మన్లు, సర్పంచ్‌లు, జడ్పీ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానాలు పెడుతున్నారు. ఎందుకంటే వచ్చే ఫిబ్రవరికి సర్పంచ్‌లకు ఐదేళ్లు నిండిపోతాయి. వచ్చే మార్చి నాటికి మునిసిపల్ పాలకవర్గాల గడువూ ముగిసిపోతోంది. 2026 సెప్టెంబరు నాటికి జడ్పీటీసీలకు ఐదేళ్లు పూర్తవుతాయి. ఇంతలో కంగారు ఎందుకనేలా కూటమి నేతలు ఉన్నారు. ఎక్కువమంది టీడీపీ, జనసేన వైపే మొగ్గు చూపుతున్నారు. కానీ గ్రీన్ సిగ్నల్ అందడం లేదు. ఈ ఏడాది డిసెంబర్ నుంచే స్థానిక ఎన్నికల సందడి మొదలు కావచ్చు.

రానున్నాయి.. స్థానిక ఎన్నికలు!

మునిసిపల్ పాలకవర్గాలకు 2021 మార్చి 10న ఎన్నికలు జరిగాయి. 18వ తేదీన చాలా ప్రమాణ స్వీకారాలు జరిగాయి. ఈ ఏడాది మార్చి 18తో పాలకవర్గాలకు నాలుగేళ్లు నిండిపోయాయి. 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో వైసీపీ అప్రజాస్వామికం, దౌర్జన్యంగా వ్యవహరించడంతో అన్ని మునిసిపాలిటీల్లోనూ వైసీపీ గెలిచిన సంగతి తెలిసిందే. దీంతో అధికారం వైసీపీ వశమైంది. మొత్తం 12 మునిసిపాలిటీల్లో అప్పట్లో టీడీపీకి 50 మంది కౌన్సిలర్లు, జనసేనకు 18 మంది, బీజేపీకి 8, కాంగ్రెస్‌కు ఒకటి, వైసీపీకి 319 వచ్చాయి. వీరిలో ఇప్పటికే చాలా మంది పార్టీ మారారు. గ్రామ పంచాయతీలకు 2021 ఫిబ్రవరి 9 నుంచి 21వ తేదీ వరకూ ఎన్నికలు 4 దశల్లో జరిగాయి. ఆ ఎన్నికల్లో వైసీపీకి 805, టీడీపీ, మిత్రపక్షాలకు 143 సర్పంచ్ పదవులు లభించాయి. 805 మందిలో ఇప్పటికే చాలామంది కూటమిలో చేరారు. జడ్పీ ఎన్నికలకు 2021 ఏప్రిల్ ఒకటో తేదీనే ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వడంతోపాటు కేవలం 8వ తేదీనే పోలింగ్ జరిగేటట్టు ప్రకటించడం వివాదాస్పదమైంది. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం కనీసం నాలుగు వారాలు గడువుతో ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వాలి. కేవలం ఒకటో తేదీనే నోటిఫికేషన్ ఇచ్చి 8న పోలింగ్ తేదీ అని చెప్పడంతో ఇబ్బంది అయింది. అయినా వైసీపీ మొండిగా ఎన్నికలు నిర్వహించింది. కోర్టు వివాదాల నేపథ్యంలో 2021 సెప్టెంబరు 19న ఫలితాలు ప్రకటించారు. కానీ టీడీపీ అధికారంలోకి రావడంతో వైసీపీ జడ్పీసీలంతా స్తబ్దుగా ఉన్నారు. జిల్లాలు విడిపోయినా.. జడ్పీ విభజన జరగలేదు. ఇప్పటికే చాలామంది జడ్పీటీసీలు కూటమిలో చేరగా, కొందరు జడ్పీటీసీలు సైలెంట్ అయ్యారు. ప్రస్తుతం కూటమి నేతలతో టచ్‌లో ఉన్నారు. పార్టీ మారేందుకు సిద్ధమంటున్నారు.



పుష్కరాల నిర్వహణపై రౌండ్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు, ప్రముఖులు

పుష్కరాలు విజయవంతం చేస్తాం
రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : 2027లో జరగబోయే గోదావరి పుష్కరాలను అన్ని వర్గాల సహకారంతో విజయవంతం చేస్తామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు.ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో శనివారం రాజమహేంద్రవరంలోని ఛాంబర్ భవనంలో గోదావరి పుష్కరాలు, నగర సమగ్ర అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై శనివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రోన్ల సమీకృత సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసి సమర్థవంతంగా వినియోగించుకుంటామన్నా రు. చిరువ్యాపారులకు నష్టం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపిక చేసిన ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా సామూహిక వ్యాపారం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. గోదావరి నదీతీరంలో ఎక్కడ స్నానమాచరించినా పుణ్యమే అన్న విషయాన్ని భక్తుల్లో విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. గోదావరి పుష్కరాలను రాజకీయాలకు అతీతంగా నిర్వహించాలని వైసీపీ కేంద్ర కమిటీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. గత పుష్కరాల్లో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. పుష్కరాల్లో భాగంగా చిరు వ్యాపారులకు నష్టం కలిగే చర్యలు తీసుకోకూడదని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. మూడు పాత మేజర్ డ్రైనేజీలను ఎస్టీపీ ప్లాంట్‌కు అనుసంధానించాలి అని సూచించారు. పవిత్ర గోదావరిలో స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఘాట్ల మార్గాలను సూచించే బోర్డులను ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకుడు కంటిపూడి సర్వారాయుడు సూచించారు. గోదావరి పుష్కరాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెద్ద ఎత్తున వినియోగిస్తాం అని ఆర్డీవో కృష్ణనాయక్ అన్నారు. 2027 పుష్కరాలను విజయవంతం చేస్తామని కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. చిరు వ్యాపారులకు నష్టం కలగకుండా మెయిన్‌రోడ్డుకు అనుసంధానంగా ఉన్న రోడ్లను అభివృద్ధి చేయాలని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తవ్వా రాజా అన్నారు. పుష్కరాల సమయంలో ముఖ్యంగా శానిటేషన్‌పై దృష్టిపెట్టాలి. చిరువ్యాపారులను ఇబ్బందిపెట్ట కూడదు అని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు తాటిపాక మధు, టి.అరుణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ సుబ్బరాజు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ తిలక్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, రుడా మాజీ చైర్‌పర్సన్ ఎం.షర్మిలారెడ్డి, కాంగ్రెస్ నాయకులు అసదుల్లా అహ్మద్, నందెపు శ్రీనివాస్, వై.శ్రీను, జామి సత్యనారాయణ, కాశి నవీన్‌కుమార్, నల్లం శ్రీను పాల్గొన్నారు.



కొవ్వూరులో యోగాంధ్ర

కొవ్వూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవన విధానంలో ఒక భాగం చేసుకోవాలని కలెక్టర్ ప్రశాంతి సూచించారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రం ప్రధాన ఘాట్‌లో శనివారం ఆర్డీవో రాణి సుస్మిత పర్యవేక్షణలో మాక్ యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా గురువు సరోజ యోగాసనాలు వేయించారు. బ్రహ్మకుమారీస్ సోదరి రాజయోగ ధ్యానం చేయించారు.కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ జూన్ 21వ తేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మాక్ యోగాంధ్రను చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 7 లక్షల 64 వేల మంది యోగాంధ్ర యాప్‌లో రిజిస్టర్ అయ్యారన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల ఆదేశాల మేరకు గత నెల రోజులుగా యోగాపై గ్రామ స్థాయి నుంచి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఏడు పదుల వయసు దాటినా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు అంత ఉత్సాహంగా ఉండడానికి కారణం యోగా అన్నారు.జేసీ ఎస్.చిన్నరాముడు మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున ప్రపంచంలోనే రికార్డు సాధించబోతున్నామన్నారు. ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ యోగా ద్వారా మానసికోల్లాసం, కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, పట్టణ సీఐ పి. విశ్వం, మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, పట్టణ టీడీపీ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, కమిషనర్ టి. నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో మాక్ యోగాంధ్ర.. మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం : కలెక్టర్

రాజమహేంద్రవరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2100 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం అందిస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఈ నెల 25లోపు జిల్లాలోని చిన్న/సన్నకారు రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గత ఆర్థిక సంవత్సరంలో 500 ఎకరాలు లక్ష్యంగా నిర్దేశించుకోగా 643 ఎకరాల్లో పెంపకం చేపట్టడం జరిగిందన్నారు. పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించడం కోసం మామిడి, జీడి మామిడి, ఆయిల్ పాం, డ్రాగన్ ఫ్రూట్, నిమ్మ, బత్తాయి, కొబ్బరి, సపోటా, సీతాఫలం, కోకో తదితర 26 పంటలను అనుమతిస్తామన్నారు. పండ్ల రకాల ఆధారంగా ఎకరాకు మూడేళ్లకు రూ.68,103 నుంచి రూ.2,51,226 వరకూ లబ్ధి చేకూరే అవకాశం ఉందన్నారు. దరఖాస్తులను గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలన్నారు. అవకాశాన్ని పండ్ల సాగు చేసే రైతులు సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ ఎం.నాగమల్లేశ్వరరావు కోరారు.

ఏటీఎస్ సెంటర్‌కు వ్యతిరేకంగా 1న చలో రాజానగరం

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): వాహనాల ఫిట్‌నెస్ ధ్రువీకరణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ జూలై 1న చలో రాజానగరం నిర్వహిస్తున్నామని ఆటో, కార్ లారీ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు వాసంశెట్టి గంగాధరరావు, బొలిశెట్టి బాక్స్ ప్రసాద్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం కంబాలచెరువు వద్ద ఉన్న బెలూన్ మినీ ఫంక్షన్ హాలులో శనివారం విలేకరులతో మాట్లాడారు. వాహనాల ఫిట్‌నెస్ విషయంలో కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించి ఏటీఎస్ సెంటర్లను ఏర్పాటు చేసిందన్నారు. ఎంవీఐ తనిఖీ చేసి వాహనాల ఫిట్‌నెస్ జారీ చేయాల్సిన చోట ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం సరికాదన్నారు. ఏటీఎస్ సెంటర్‌లో వాహనాలు తనిఖీచేసే మిషనరీ పవర్‌కు ఇంజన్లు దెబ్బతింటున్నాయన్నారు. ఆన్‌లైన్‌లో వాహనాల ఫిట్‌నెస్‌కు చిన్నవాహనానికి రూ. 920, పెద్దవాహనాలకు రూ .1320 కట్టించుకుంటున్నారని అది కూడా సుమారు 6 గంటలు పైబడి ప్రోసెస్ నడుస్తుందన్నారు.అప్పుడు గుజరాత్‌లో కార్మిక సంఘాల డిమాండ్ మేరకు ఆర్‌టీవో కార్యాలయంతో పాటు ఎటీఎస్ కూడా అమలు చేశారని చెప్పారు.ఇదే విధానం ఏపీలో కూడా అమలుచేయాలన్నారు.జూలై 1న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జిల్లాలో ఆటోలు, లారీలు, కార్లు తిరగకుం డా శాంతియుతంగా ఏటీఎస్ సెంటర్‌కు చేరుకుని నిరసన చేస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వాసంశెట్టి గంగాధరరావు, బాక్స్ ప్రసాద్ తదితరులు

నేడు ఫాదర్స్ డే



నాన్నకు ప్రేమతో..

- రాజమహేంద్రవరం, కాకినాడ, అనపర్తి, ఉప్పలగుప్తం/ఆంధ్రజ్యోతి

ఒకప్పుడు నాన్నలు కఠినంగా ఉండేవారు. తమ పిల్లలకు విలన్లుగా కనిపించేవారు. కేవలం చదువుకు మాత్రమే విలువ ఇచ్చేవారు. ఏదైనా కొనమంటే పదేపదే ఆలోచించేవారు. ఇప్పుడు వద్దు అని కరాఖండీగా చెప్పేవారు. చదువుకొంటేనే మంచి భవిష్యత్తు అని వారి స్టైల్లో చెప్పేవారు. అయితే వారి మాటలు చెవికెక్కించుకున్న పిల్లలు నేడు మంచి ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. అప్పట్లో పిల్లలు కూడా నాన్నను ఏదైనా అడగాలంటే భయపడేవారు. అమ్మ ద్వారానే నాన్నకు విషయం వెళ్లేది.. **కానీ నేడు...** నాన్నలు పిల్లలకు హీరోలుగా మారారు. చాలా మంది వారిని స్ఫూర్తిగా తీసుకుంటున్నారు. ఇక నాన్నలు కూడా వారి పిల్లలను గారాబంగా పెంచుతున్నారు. వారు అడిగింది ఏదీ కాదనకుండా కొనిచ్చేస్తున్నారు. నాన్న, పిల్లల మధ్య బంధం ఫ్రెండ్స్‌లా మారిపోయింది. ఏ విషయాన్నైనా నాన్నతో ఈజీగా పంచుకునే రోజులు వచ్చేశాయి. ఆఖరికి తాను ఫలానా అమ్మాయిని ప్రేమిస్తున్నాను అనే మాటను కూడా నేడు పిల్లలు సులువుగా నాన్నకు చెప్పేస్తున్నారంటే.. నాన్న మారిపోయాడని అర్థమవుతోంది.

● నాన్న ఎందుకో వెనుకబడ్డాడు..

బిడ్డలపై చూపించే ప్రేమలో తల్లిదండ్రుల పాత్రలు సమానం. కుటుంబం గురించి ఆలోచించే క్రమంలో, అవసరాలను తీర్చే దారిలో అమ్మానాన్నా సమానమే అయినా నాన్న కాస్త ఎక్కువగా టెన్షన్ పడుతూ ఉంటాడు. సాధారణంగా ఏ ఇంట్లో అయినా చూస్తే.. అందరికంటే తక్కువ బట్టలు, చెప్పుల జతలు నాన్నకే ఉంటాయి. వాటి గురించి కూడా పెద్దగా పట్టించుకోడు. కానీ పిల్లల మనసులో మాత్రం నాన్న ఎప్పుడూ కాస్త వెనుకబడుతూనే ఉంటాడు. ఎందుకంటే.. అమ్మ తిడిడే లాలనగా ఉంటుంది.. నాన్న కోప్పడితే ఆక్రోశంలా కనిపిస్తుంది. నిజానికి నాన్న కోపాన్ని పిల్లల భవిష్యత్తు ప్రతి క్షణం శాసిస్తూ ఉంటుంది. అందుకే బయటకు కఠినంగా ఉంటూ లోపల వెన్నపూసలా కరిగిపోతూ ఉంటారు. చాలా మంది పిల్లలు తల్లికి ఇచ్చినంత ప్రాధాన్యం తండ్రికి ఇవ్వరని సర్వేలు చెబుతున్న వాస్తవం. అయితే జీవిత కథలు చూసుకుంటే నాన్న నుంచి నేర్చుకున్న వాళ్లే ఎక్కువగా ఉంటారు. అది మంచి అయినా.. చెడు అయినా. కుటుంబానికి ఎంత చేసినా అధిక శాతం తండ్రులు పిల్లల దృష్టిలో చులకనే. దీనివల్ల లోలోపల కుమిలిపోయే తండ్రులు ఎంతో మంది ఉన్నారు. కాస్త ఎదిగిన పిల్లలు నీకెందుకు నేనున్నాగా అని నాన్నతో ఒక్క మాట అంటే మౌనంగా ఎంతో మురిసిపోతారు. ఆ మాటను వంద మందికి చెప్పుకొని గంతులు వేస్తారు. అందుకనే నాన్నను అర్థం చేసుకుంటే జీవితాన్ని ఔపోసన పట్టినట్టే. ఇక అంతర్జాతీయ పితృ దినోత్సవాన్ని ప్రతి ఏడాది జూన్ నెలలోని మూడో ఆదివారం జరుపుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 60 దేశాల్లో తండ్రుల గౌరవార్థం ఈ వేడుక నిర్వహిస్తున్నారు. మాతృ దినోత్సవం మాదిరిగానే పితృ దినోత్సవం ఉండాలనే తలంపుతో అమెరికాకు చెందిన సొనోరా అనే మహిళ పితృ దినోత్సవంపై ప్రచారం మొదలుపెట్టారు. దీంతో 1910లో మొదటిసారిగా ఫాదర్స్ డేని నిర్వహించారు.

మంచి స్నేహితులం.. - ఎస్పీ నరసింహ కిషోర్

నాన్న దూసి ధర్మారావు. టీచర్, జూనియర్ లెక్చరర్‌గా పనిచేశారు. ఆయన చాలా ఫేమస్ పర్సనాలిటీ. ఆయన నన్ను ఎప్పుడూ స్నేహితుడి మాదిరిగానే చూశారు. బిగ్ రోల్ మోడల్. ఆయన పూర్తి ప్రభావం నా మీద ఉంది. చిన్నప్పటి నుంచీ ఆయనతో కలిసే తిరిగాను. ఆయన ప్రపంచం చాలా పెద్దది. గవర్నమెంట్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఆయన ప్రిన్సిపాల్‌గా చేసే సమయంలో 8, 9, 10 అక్కడే చదువుకున్నాను. మంచి సామాజిక, సాహిత్య సేవకులు. చరిత్ర సంస్కృతిని కాపాడడంలో గొప్ప కృషి చేశారు. మంచి రచయిత, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్. ఏ రోజూ నా జీవిత మార్గాన్ని నిర్దేశించలేదు. చాలా స్వేచ్ఛగా ఆలోచనలు చేసుకొనే అవకాశం ఇచ్చారు. ఆయనకు నెగిటివ్ ఆలోచనలు, మాటలు ఎప్పుడూ నచ్చేది కాదు. 'మంచి ఉద్యోగం చేస్తే చాలు. సొసైటీకి నీ కంట్రిబ్యూషన్ ఉంటే చాలు. టీచర్, అటెండర్ కూడా కంట్రిబ్యూట్ చేయవచ్చు. సామాజిక స్పృహ ఉండాలి. పక్కవాడి మంచి గురించి ఆలోచించాలి. సొసైటీని విమర్శించుకుంటూ బతకొద్దు. అప్పుడు మనల్ని వదిలేసి సమాజం ముందుకు సాగిపోతుంది. సమాజంలో అడ్డంకులను అధిగమించి మనం చేయాలనుకున్నది చేసుకుపోవాలి. పదిమందికి ఉపయోగంగా ఉండాలి' అని నిరంతరం చెబుతూ ఉండేవారు. 'ఆయన దినచర్య ఉదయం ఆరు గంటలకు ప్రారంభం అయ్యేది. ఉద్యోగం, సామాజిక సేవలు చూసుకొని రాత్రి 11గంటల సమయంలో ఇంటికి చేరేవారు. సమాజంలోని వివిధ అంశాలు, సేవ వంటి వాటిపై ఇద్దరి మధ్యా తరచు చర్చ నడుస్తుండేది. ఏ రోజూ ఇది చదువని ఆయన చెప్పలేదు. అల్లరి చేస్తున్నా ఏమీ అనేవారు కాదు. ఎవరికి వారే తమ తప్పు తెలుసుకొని దాని నుంచి బయటకు రావాలి. ఎవరో చెబితే తెలుసుకోవడం వల్ల పెద్దగా ఉపయోగం ఉండదు. ఈరోజు బతికున్నామంటే చక్కగా, హ్యాపీగా ఉండాలి. కష్టాన్ని అంగీకరించకూడదు. దానిపై ఫైట్ చేయాలి. దుఃఖం వచ్చిందని అక్కడే ఆగిపోకూడదు. దాని నుంచి బయటపడే మార్గం కూడా మన దగ్గరే ఉంటుంది' అని చెప్పేవారు. ఆయన చాలా పుస్తకాలు రాశారు. రసతరంగిణి, స్టోరీ ఆన్‌స్టోన్ వంటి పుస్తకాలు రాశారు. ఆయన నాకు ప్రతి క్షణం గుర్తొస్తూనే ఉంటారు. నేను, సమాజం కూడా ఆయనను మరిచిపోయే రోజు ఉండదు. దురదృష్టవశాత్తూ ఆయన 2017లో కాలం చేసినా నాతోనే ఎప్పుడూ ఉంటారు.


'తూర్పు' ఎస్పీ నరసింహ కిషోర్.. తండ్రి ధర్మారావు

- దూసి నరసింహ కిషోర్, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ

మా నాన్నే హీరో

నాన్న పీఎంపీ.. పిల్లలు డాక్టర్లు



నా తండ్రి షేక్ చినవలియా. మాది ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి. నిరుపేద కుటుంబం. ఆయన తన తండ్రికి సహాయపడాలన్న ఆలోచనతో ఒక ఆసుపత్రిలో సహాయకుడిగా చేరారు. తర్వాత స్వగ్రామంలో పీఎంపీగా వైద్య సేవలందిస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చారు. కానీ తన పిల్లలు తనలా సంచికట్టు డాక్టర్లు కాకూడదని, వైద్య వృత్తిలో పట్టభద్రులుగా చూడాలని కలలు గన్నారు. పిల్లలు వైద్యులుగా పట్టాలు తీసుకుని సమాజంలో గొప్పగా జీవించాలన్నది ఆయన సంకల్పం. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కుంటూనే మమ్మల్ని మెడిసిన్ చదివించారు. మేం ముగ్గురం. పెద్ద కుమారుడు అహ్మద్ అలీషా దంత వైద్యునిగా క్లినిక్ నడుపుతున్నారు. కుమార్తె హసీనా ప్రస్తుతం రావులపాలెం మండలం ఊబలంక పీహెచ్‌సీ వైద్యాధికారిణి. మూడో కుమారుడు అబ్దుర్‌రెహమాన్ బెంగళూరులో ఎంబీఏ చదువుతున్నాడు. పీఎంపీగా మా తండ్రి మమ్మల్ని వైద్య పట్టభద్రులుగా చూడాలని ఎన్నో ఆర్థిక ఇబ్బందులను తట్టుకున్నారు. తలకు మించిన భారం ఎందుకని పలువురు సలహాలిచ్చినా పట్టించుకోకుండా మా ఉన్నతి కోసం నిత్యం తపించారు. ఆయన కడుపున పుట్టడం నిజంగా ఎంతో అదృష్టం. ఎప్పటికీ మా నాన్నే మా హీరో.

నాన్న బాటలోనే రాజకీయాల్లోకి..

అనపర్తి శాసనసభ్యుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

ప్రతి ఒక్కరికి కొన్ని కలలుంటాయి. ఇలా ఎదగాలని, ఇలా స్థిరపడాలని ఉంటుంది. కానీ ఒక్కోసారి కుటుంబ ప్రభావంతో మనం కోరుకున్న దారి మారిపోతుంటుంది. నేను డాక్టర్ కావాలనుకున్నా. కానీ ఇంజనీర్ అయ్యా. కానీ కుటుంబ వారసత్వ రాజకీయాల ప్రభావంతో రాజకీయ నేతగా మారిపోయా. నా తండ్రి నల్లమిల్లి మూలారెడ్డి 1970 ప్రాంతంలో అనపర్తి మండలం రామవరం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికై రాజకీయ ఆరంగ్రేటం చేశారు. తర్వాత తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో అన్న ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా సమాజ సేవకు ముందుకు వచ్చి అనపర్తి ఎమ్మెల్యేగా నాలుగు పర్యాయాలు గెలిచి నియోజకవర్గ ప్రజలకు సేవలందించారు. నాకు మాత్రం డాక్టర్ కావాలనేది కల. అనుకోనివిధంగా ఇంజనీరింగ్ కోర్సు చదివి బీఈ పట్టా పొందా. పారిశ్రామికవేత్తగా పేరు తెచ్చుకోవాలని వంశీ పవర్ పేరుతో పవర్‌ప్లాంట్‌ను స్థాపించారు. కానీ ఎన్నికల సమయంలో తండ్రికి చేదోడుగా నిలిచేవాడిని. నా తండ్రికి నాటికలపై ఉన్న మక్కువతో ఏర్పాటుచేసిన మూలారెడ్డి కళా పరిషత్ బాధ్యతలను వేసుకున్నా. తర్వాత నా తండ్రి వారసుడిగా 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించా. తిరిగి 2024 ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీచేసి రెండవ పర్యాయం ఎమ్మెల్యేగా గెలుపొందా. సాధరణంగా ఒక కుటుంబంలో తాను, భార్య బిడ్డలు బావున్నారా అనే చూసుకుంటారు.. కానీ తనను నమ్ముకున్న కుటుంబాలు ఎలా ఉన్నాయి, వారికి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని నిత్యం ఆలోచనలతో ముందుకుసాగుతూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ ప్రజల అభిమానాన్ని చూరగొన్న మూలారెడ్డికి కొడుకుగా జన్మించడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నా. ఆయన చూపిన బాటలోనే పయనిస్తున్నా.


తండ్రి మూలారెడ్డితో అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

నీట్-2025 ఫలితాల్లో 'తిరుమల' ప్రభంజనం

కిరీటికి స్టేట్ ఫస్ట్ ర్యాంక్
ఆలిండియా స్థాయి ర్యాంక్‌లతో సత్తాచాటిన విద్యాసంస్థ


స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ రామ్‌కిరీటి


ర్యాంకర్లతో చైర్మన్ తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్-2025 ఫలితాల్లో రాజమహేంద్రవరం తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ విద్యార్థులు ఆలిండియా స్థాయిలో అత్యుత్తమ ర్యాంక్‌లతో ప్రభంజనం సృష్టించారు. ఓపెన్ కేటగిరిలో దర్బా కార్తీక్ రామ్‌కిరీటి ఆలిండియా స్థాయిలో 19వ ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా తిరుమల విద్యాసంస్థలో శనివారం విజయోత్సవం జరిపారు. ర్యాంకర్లకు స్వీట్లు తినిపించారు. అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో తిరుమలరావు మాట్లాడారు. తమ విద్యార్థులు కె.ఈప్సిత్ కశ్యప్ 12వ ర్యాంక్, టి.సాహితి 32వ ర్యాంక్, కేవీవీ నాగసాయి పవన్ 154వ ర్యాంక్, ఎం.సూర్య సంతోష్ రెడ్డి 880వ ర్యాంక్, ఎల్.అభిషేక్ 888వ ర్యాంక్, టి.రామచంద్రన్ 1145వ ర్యాంక్, ఎల్.వర్షిత్ 1237వ ర్యాంక్, పి.ప్రశంస 1851వ ర్యాంక్, కె.విన్షిత 1909వ ర్యాంక్ కైవసం చేసుకున్నారని తెలిపారు. అలాగే వెయ్యి లోపు 6 ర్యాంక్‌లు, 5వేలలోపు 35, పది వేల లోపు 71, 20వేలలోపు 138, 30వేలలోపు 189 ర్యాంక్‌లు సాధించారని పేర్కొన్నారు. తమ విద్యార్థులు 250 మంది ఫైబడి ఎంబీబీఎస్ సీట్లు సాధించగలరన్నారు. ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరిలతో కలిసి తిరుమలరావు అభినందించారు.

వైద్యురాలిగా సేవలందిస్తా

టి.సాహితి, 32వ ర్యాంకర్



నీట్‌లో ఆలిండియా స్థాయిలో 32వ ర్యాంక్ సాధించడం చాలా ఆనందంగా ఉంది. తిరుమల విద్యాసంస్థల్లో చదువుకోవడం వల్లే ర్యాంక్ సాధించగలిగాను. ఫ్యాకల్టీ ఇచ్చిన ప్రోగ్రామ్స్‌ను ఎప్పటికప్పుడు చూసుకుంటూ సలహాలు, సూచనలు పాటిస్తూ కష్టపడి చదివాను. చైర్మన్ తిరుమలరావు ప్రోత్సాహం, నా తల్లిదండ్రులు టీవీ ఆర్ రాజు, నాగమణిల ప్రోద్బలం ఉంది. ఆర్థోపె డిక్ వైద్యురాలిగా సేవలందించాలనే లక్ష్యంతో చదువుతున్నా.

శివమణిదీప్‌కు 92వ ర్యాంకు


శివమణిదీప్

రావులపాలెం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రావులపాలెనికి చెందిన తుమ్మూరి శివమణిదీప్ నీట్ ఫలితాల్లో 92(ఎంబీసీ ఎన్‌సీఎల్) ర్యాంకు సాధించాడు. ఎంఎస్ న్యూరోసర్జన్ చేయడమే లక్ష్యంగా ప్రిపేర్ అయినట్టు మణిదీప్ తెలిపాడు. నీట్ ఫలితాల్లో మంచి ర్యాంకు సాధించడంతో తనతో పాటు కుటుంబ సభ్యులు ఆనందిస్తున్నారన్నారు. అతడి తండ్రి వెంకటరత్నం రైల్వే ఉద్యోగి కాగా, తల్లి నాగలక్ష్మి గృహిణి.

సంజనకు 227వ ర్యాంకు

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్ ఫలితాల్లో జిల్లా కాకినాడ సర్పవరానికి చెందిన బొర్రా సంజన ఆల్ ఇండియా 227వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచి ర్యాంకు సాధించడం చాలా సంతోషంగా ఉంది. దేవుని మీద నమ్మకం వల్ల ఇది సాధ్యమైంది. తల్లిదండ్రులకు కృతజ్ఞతలుతెలియజేయాలనుకుంటున్నా.


తల్లిదండ్రులతో సంజన

పాములేరు వాగులో ఇద్దరు యువకుల గల్లంతు


గల్లంతైన సాలీష్, రవితేజ ఫైల్‌ఫొటోలు

మారేడుమిల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి పాములేరు వాగులో ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. శనివారం విజయవాడ నుంచి 10 మంది స్నేహితులు మారేడుమిల్లి పర్యాటకానికి వచ్చారు. పాములేరు వాగులో డి.సాలీస్ (23), కటకం రవితేజ (30), మరో ఇద్దరు యువకులు స్నానానికి దిగారు. వాగులో వారు గల్లంతవుతుండగా తోటి స్నేహితులు రక్షించే ప్రయత్నం చేశారు. ఇద్దరు ప్రాణాలతో బ యటపడగా సాలీస్, రవితేజ గల్లంతయ్యారు. దీంతో మిగిలిన స్నేహితులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సీఐ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఎస్డీఆర్ఎఫ్ బృందాలు శనివారం రాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ గల్లంతైన ఇద్దరు యువకుల ఆచూకీ లభించలేదు.

'ఏయూ' దూరవిద్య తరగతులు ప్రారంభం

కాకినాడ రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిస్టెన్స్, ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ 2022 విద్యాసంవత్సరం ఫైనల్ ఇయర్, 2024 క్యాలెండర్ ఇయర్ 3,4 సెమిస్టర్లు, క్యాలెండర్ ఇయర్ 2025 1,2వ సెమిస్టర్ విద్యార్థులకు శనివారం తరగతులు ప్రారంభమైనట్టు పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఆంజనేయులు తెలిపారు. బీఏ,బీకామ్ విద్యార్థులకు వారాంతపు తరగతులు కళాశాలలో ఉదయం 8.30 గంటల నుంచి 5.30 వరకూ జరుగుతాయన్నారు. ఈ తరగతులను జూలై 13వరకూ వారంలో ప్రతీ శని, ఆదివారాలు నిర్వహించనున్నామని ఇతర వివరాలకు 9848405370కు ఫోన్‌చేయాలని సెంటర్ సమన్వయకర్త డాక్టర్ కె.నాగేశ్వరావు తెలిపారు

తాండవ నదిలో స్నానానికి దిగి వ్యక్తి మృతి


నదిలో శివ మృతదేహం

కోటనందూరు, జూన్14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కోటనందూరు తాండవ నదిలో స్నానానికి దిగి వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. విశాఖ జిల్లా పాతగాజువాకకు చెందిన మునుశాల శివ స్థానికంగా రెండేళ్ల నుంచి నివాసం ఉంటున్నాడు. శనివారం మధ్యాహ్నం తాండవ నదిలో స్నానానికి దిగి మృతిచెందాడు. దీంతో స్థానికులు ఎస్ఐ టి.రామకృష్ణకు తెలిపారు. గాజువాకలో ఉన్న మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం తెలియజేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తునికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

'ఆదిత్య' విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

● అఖిల భారతస్థాయిలో

109, 227, 890 ర్యాంకులు కైవసం

కాకినాడ రూరల్,జూన్14(ఆంధ్రజ్యోతి): నీట్ ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులు ప్రతిభ కనబరిచి అఖిల భారతస్థాయిలో 109, 227, 890 ర్యాంకులు కైవసం చేసుకున్నారని విద్యా సంస్థల కార్యదర్శి ఎస్.కృష్ణదీపక్‌రెడ్డి తెలిపారు. వీరంరెడ్డి సాయిభవ్యహర్షిణి 625 మార్కులతో 227వ ర్యాంకు, దగ్గుమటి సవన్‌కార్తికేయ 109వ ర్యాంకు, డి.శ్రీనివాస రిషిత్ 890వ ర్యాంకు సాధించారన్నారు. అంతేకాకుండా 720 మార్కులకుగానూ 550మార్కులపైన 12మంది ఆదిత్య విద్యార్థులు పొందినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమర్యాంకులు సాధించిన విద్యార్థులను వారికి శిక్షణనిచ్చిన అధ్యాపకులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి కృష్ణదీపక్ రెడ్డి, హాస్టల్స్ డెరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్లు శృతి, సుగుణ, ప్రిన్సిపాల్ మొయినా అభినందించారు.


సవన్ కార్తికేయ 109వ ర్యాంకు | సాయిభవ్యహర్షిణి 227వ ర్యాంకు | శ్రీనివాస రిషిత్ 890వ ర్యాంకు

వైద్యుల నిర్లక్ష్యంతో పసికందు మృతి

తాళ్లరేవులో కుటుంబసభ్యుల ధర్నా


తాళ్లరేవులో ధర్నా చేస్తున్న బాధిత కుటుంబసభ్యులు

తాళ్లరేవు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యంతో ముక్కుపచ్చలారని పసికందు మృతిచెందిందని, తమకు న్యాయం చేయాలని కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరింగి పంచాయతీ పెదబొడ్డువెంకటాయపాలెనికి చెందిన బాధితులు తాళ్లరేవు ఆసుపత్రి వద్ద మత్స్యకార నాయకుడు వాడ్రేవు వీరబాబు ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. పెదబొడ్డువెంకటాయపాలెనికి చెందిన చెక్కా మాధురి డెలివరీ కోసం తాళ్లరేవు ఆసుపత్రిలో చేరింది. శనివారం తెల్లవారుజామున ఆమెకు పురిటినొప్పులు రాగా వైద్యులు ఆసుపత్రిలో ఉండి కూడా పట్టించుకోకపోవడంతో స్వీపరు డెలివరీ చేసింది. శిశువు ఉమ్మ నీరు ఎక్కువ తాగడంతో మృతిచెందిందని వైద్యులు బాధితులకు చెప్పకుండా అంబులెన్స్‌లో కాకినాడ తరలించారు. కాకినాడ ప్రభుత్వాసుపత్రి వైద్యులు శిశువు మరణించిందని చెప్పడంతో మృతదేహంతో బాధితులు, బంధువులు తాళ్లరేవు ఆసుపత్రికి చేరుకుని వైద్యులు, సిబ్బందిని నిలదీశారు. రోడ్డుపై బాధితులు బైఠాయించి సూపరింటెండెంట్, డ్యూటీ డాక్టరు స్నేహలత, సిబ్బందిని సస్పెండ్ చేసి తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని బాధితులు, బంధువులు ధర్నా చేశారు. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ, కోరింగ ఎస్ఐ సత్యనారాయణ, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించారు. ఆందోళనకారులతో ప్రభుత్వ విప్, ము మ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు చర్చలు జరిపి న్యాయం చేస్తామని ఆందోళన విరమించారు. విచారణ కమిటీ సభ్యులు వినోద్, సుజాత తాళ్లరేవు ఆసుపత్రికి చేరుకుని వివరాలను సేకరించి కలెక్టరు నివేదించి 48 గంటల్లో చర్యలు తీసుకుంటామన్నారు. స్టాఫ్‌నర్సు ఇందిర నిర్లక్ష్యం కారణంగా భావించి సస్పెండ్‌చేసినట్టు తెలిపారు.

దోపిడీకి బయలుదేరి.. గంజాయితో పట్టుబడి...

● కొవ్వూరులో ఏడుగురి అరెస్ట్

● కారు, కత్తులు, సెల్‌ఫోన్లు స్వాధీనం


కొవ్వూరులో గంజాయితో ఏడుగురిని అరెస్టు చేసిన పోలీసులు

కొవ్వూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గంజాయితో ఏడుగురిని అరెస్టు చేసినట్టు కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ తెలిపారు. కొంతమంది వ్యక్తులు కారులో గంజాయి తరలిస్తున్నారని సమాచారం రావడంతో తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు రోడ్ కం రైలు బ్రిడ్జి వద్ద కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం, తాళ్లపూడి ఎస్ఐ టి.రామకృష్ణ శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. కారులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఏడుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి 26 కిలోల గంజాయి, బాలినో కారు, 2 కత్తులు, ఇనుపరాడ్డు, 5 సెల్ ఫోన్లు, రూ.1130 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించి వివరాలు తెలుసుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం మార్టేరుకి చెందిన సాకావంశీ, తణుకు పాటికచ్చివారి వీధికి చెందిన ఇజ్జాడ పాపినాయుడు, పెరవలి మండలం అజ్జరం గ్రామానికి చెందిన మర్రి సామేలు, పాలంగి సుబ్బరాజు, కాండ్రేగుల గురుప్రసాద్, పెరవలికి చెందిన చినిమిల్లి శివకృష్ణ, నవరపు ప్రవీణ్ కలిసి ఒక ప్రైవేటు ట్రావెల్స్ నుంచి బాలినో కారును అద్దెకు తీసుకుని దోపిడీ చేయడానికి నిర్ణయించుకుని బయలుదేరారు. దొంగతనం చేయడానికి ఇనుపరాడ్డు, పెద్ద కత్తి, చిన్న కత్తిని కారులో పెట్టుకుని శ్రీకాకుళం జిల్లా చిలకపాలెంలో బంగారపు షాపులో దొంగతనం చేయడానికి సన్నాహం చేసుకున్నారు. ముందుగా రెక్కీ నిర్వహించి అక్కడ నుంచి వస్తూ అల్లూరి సీతారామరాజు జిల్లా దారవరంలో 26 కిలోల గంజాయిని తీసుకుని కారులో పెట్టుకుని పెరవలి వస్తున్నారు. కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి టోలిగేటుసెంటర్‌లో శనివారం మధ్యాహ్నం వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు కారును నిలుపుదలచేసి అనుమానస్పదంగా కనిపించిన ఏడుగురిని విచారించి అరెస్టు చేశారు. ఏడుగురిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు పం పించామన్నారు. కేసులో ప్రతిభ కనబర్చిన సీఐ విశ్వం, ఎస్ఐ రామకృష్ణ, సిబ్బందిని తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ అభినందించారు.

కొండగుంటూరులో గంజాయితో ఇద్దరి అరెస్టు

రాజానగరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కొండగుంటూరులోని ఒక లేఅవుట్‌లో రేకుల షెడ్ ఏర్పాటు చేసుకుని గంజాయి వ్యాపారం సాగిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో శనివారం డీఎస్పీ శ్రీకాంత్, సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్ ఈ వివరాలను వెల్లడించారు. ఒడిస్సా రాష్ట్రం మల్కాజిగిరి జిల్లా చిత్రకొండ మండలం దొరగుడ పంచాయతీకి చెందిన చంద్ర కులదీప్ అలియాస్ సురేష్, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం పొల్లూరుకి చెందిన చందన్ మండల్ గంజాయిని నిల్వ చేసి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నట్టు అందిన సమాచారం మేరకు కారులో గంజాయి తీసుకొచ్చినట్టు తెలుసుకుని శుక్రవారం సాయంత్రం దాడి చేశారు. గంజాయితో ఇద్దరిని అరెస్ట్ చేశారు. 11 ప్యాకెట్లలో 23.101 కిలోల గంజాయిని గుర్తించారు. వ్యాన్, కారు, 2 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని, సురేష్, చందన్‌ను కోర్టులో హాజరు పరిచామని డీఎస్పీ పేర్కొన్నారు. ఈ వ్యాపారానికి సూత్రధారి రఘువీర్ రాయ్, అతడి భార్య ప్రశాంతి పరారీలో ఉన్నట్టు వివరించారు. ఈ కేసులో చురుకుగా వ్యవహరించిన ఎస్ఐ నాగార్జున, సిబ్బంది కరీం, సురేష్, త్రిమూర్తులు, మహేశ్వరరావు, మురళీ, రాంప్రసాద్‌ను అభినందించారు. సమావేశంలో ఎస్ఐలు నాగార్జున, ప్రియకుమార్, నారాయణమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

కొబ్బరిచెట్టు పై నుంచి పడి..


అశోక్ (ఫైల్)

మామిడికుదురు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కొబ్బరిచెట్టు చెట్టు పై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం నగరం తాడివారి మెరకలో శుక్రవారం రాత్రి జరిగింది. నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తాడి అశోక్ కుమార్ (35) శుక్రవారం కొబ్బరి బొండాల కోసం చెట్టు ఎక్కి జారి పడడంతో తీవ్రగాయాలయాయి. రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. పెయింటర్‌గా పనిచేసే అశోక్‌కుమార్‌కు భార్య నాగమణి, 15ఏళ్ల కుమార్తె స్వప్న, 13ఏళ్ల కుమారుడు సంతోష్ ఉన్నారు. తండ్రి మరణించడంతో చిన్నారులు విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

తమిళనాడుకు తరలిస్తున్న బాల కార్మికుల గుర్తింపు

రాజమహేంద్రవరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు రైలులో తరలిస్తున్న బాల కార్మికులను గుర్తించి సంరక్షణా కేంద్రానికి పంపించామని ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్పీ) ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ టి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. డీఎస్ఆర్పీ జయరాంప్రసాద్ ఉత్తర్వులతో జీఆర్పీ, ఆర్పీ ఎఫ్ పోలీసులు బచ్‌పన్ బచావో ఆందోళన్ టీమ్‌తో కలిసి రాజమహేంద్రవరంలో రైళ్లలో తనిఖీలు చేపట్టామన్నారు. శనివారం తెల్లవారు జామున జసిద్- తాంబరం వారాంతపు రైలులో తనిఖీలు చేస్తుండగా 10మంది బాలబాలికలను భవన నిర్మాణ పనుల నిమిత్తం తమిళనాడుకు తర లిస్తుండడం గుర్తించామన్నారు. ఛత్తీస్‌గడ్‌కి చెందిన మనీషా, సరిత, సుమి పొటల్, జార్ఖండ్‌కి చెందిన తురం సవ్యాన్, లవకుష్‌రామ్, కరణ్ కుమార్, బస్దేవ్‌షా, బీహార్‌కి చెందిన విక్రమ్‌కుమార్ పాశ్వాన్, రోహిత్ కుమార్, ఉమాకాంత్ కుమార్‌లను జిల్లా బాలల సంర క్షణ సమితికి అప్పగించామన్నారు. జీరో ఎఫ్ఐఆర్ నమోదుచేసి జార్ఖండ్‌లో జసిద్ జీఆర్పీకి పంపారు.

298 సముద్రపు తాబేళ్లు స్వాధీనం

గోకవరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రవాణా చేస్తున్న 298 సముద్రపు తాబేళ్లను శనివారం గోకవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ పవన్‌కుమార్ వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా గోకవరంలోని కాజా రామ్‌కుమార్‌కు చెందిన ఖాళీ స్థలంలో అనుమానాస్పదంగా ఉన్న ఏడు గోనె సంచులను స్థానికుల సమాచారంతో గుర్తించామని, వాటిని తెరిచి చూసేసరికి 298 సముద్రపు తాబేళ్లు ఉన్నాయన్నారు. తాబేళ్లను అక్రమ రవాణా చేస్తున్నట్టు విచారణలో తెలుసుకుని వాటిని అటవీశాఖ అధికారులకు అప్పగించామన్నారు. కాగా వాటిలో 22 తాబేళ్లు మృతి చెందినట్టు అటవీ అధికారులు తెలిపారు. మిగిలిన తాబేళ్లను దేవీపట్నం మండలం పోసమ్మగండి సమీపంలోని గోదావరిలో విడిచి పెట్టినట్టు చెప్పారు. కాగా తాబేళ్లను రవాణా చేస్తూ పరారైన నిందితులను కోరుకొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.


గోకవరంలో తాబేళ్లతో ఉన్న గోనె సంచులు

కిర్లంపూడిలో అధిక వర్షపాతం

కిర్లంపూడి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం సుమారు గంటన్నర పాటు భారీ వర్షం కురిసింది. రాష్ట్రంలోనే కిర్లంపూడి మండలంలో 28.2 శాతం అధిక వర్షపాతం నమోదైనట్టు ఏఎస్‌వో నాయుడు తెలిపారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

పల్లపు ప్రాంతాలు మునగకుండా పరిష్కారం

డ్రైనేజీ మ్యాన్‌హోల్ నిర్మాణ పనుల పరిశీలనలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


డ్రైనేజీ మ్యాన్‌హోల్ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో పల్లపు ప్రాంతాలు నీట మునగకుండా శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. శనివారం స్థానిక 22వ డివిజన్ వంకాయల వారి వీధిలో జరుగుతున్న డ్రైనేజీ, మ్యాన్‌హోల్స్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు ఈ ప్రాంత డ్రైనేజీలలో చెత్తచెదారాలు పేరుకుపోయి, మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి ప్రజలు, వ్యాపారులు ఇబ్బంది పడ్డారని, ఈ విషయాన్ని స్థానిక టీడీపీ నాయకుల ద్వారా తెలుసుకుని గతంలో పరిశీలించిన ఈ డ్రైనేజీని వెడల్పు చేయాలని అధికారులకు సూచించామన్నారు. గత వైసీపీ పాలకులు చేసిన తప్పులను కూటమి చేయదన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తమకు ప్రాధానమన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాటూరి రంగారావు, మజ్జి రాంబాబు, కాశి నవీన్‌కుమార్, మాటూరి సిద్ధార్థ, దాస్యం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి పరీక్షల ఫలితాల మేరకు ఎరువులు వాడాలి


సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారిణి సరళ

దివాన్‌చెరువు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పంట సాగుకు ముందు మట్టి పరీక్షలు చేసుకుని తదనుగుణంగా ఎరువులు వాడితే పంటల్లో నాణ్యమైన దిగుబడులు పెంచుకోవచ్చునని రాజమహేంద్రవరంలోని మట్టి పరీక్ష ప్రయోగశాల వ్యవసాయ అధికారిణి ఓ.సరళ అన్నారు. దివాన్‌చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రంలో జరుగుతున్న వ్యవసాయ పరపతి సంఘం డీలర్ల సర్టిఫికెట్ కోర్సు శిక్షణలో భాగంగా శనివారం మట్టి పరీక్ష ఆధారిత ఎరువుల వాడకం, ఆవశ్యకత అనే అంశంపై ఆమె ప్రసంగించారు. మట్టి పరీక్ష చేసే విధానం, దాని ఆవశ్యకత, సమస్యాత్మక భూములను మట్టి పరీక్ష ద్వారా గుర్తించడం వంటి విషయాలను ఏవో సరళ ట్రైనీలకు వివరించారు. ట్రైనీలు అడిగిన పలు సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ పరిశోధన స్థానంలో జరిగే భూసార పరిశోధనలను వివరించారు. మట్టి పరీక్ష కేంద్రంలోని మరో వ్యవసాయాధికారిణి జి.సంధ్య నేల పరీక్షకు పాటించవలసిన పద్ధతిని ప్రయోగాత్మకంగా చూపారు. సాయిల్ హెల్త్ కార్డులను చదివి అర్థం చేసుకోవడాన్ని ట్రైనీలకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నవోదయం 2.0పై అవగాహన సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ సుధ

రంగంపేట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): భవిష్యత్ నిర్మాణానికి నేటి యువత మార్గదర్శంగా నిలవాలని ఎక్సైజ్ సీఐ సుధ అన్నారు. శనివారం మండలంలోని దొడ్డిగుంట గ్రామంలో నవోదయం 2.0, సారా వల్ల కలిగే దుష్పరిణామాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా విద్యార్థులకు ఆధునిక వనరులు, డిజిటల్ శిక్షణ, నైపుణ్యాభివృద్ధి అవకాశాలను వివరించారు. సారా కేసుల్లో తహశీల్దార్ ఎదుట బైండోవరై మరలా నేరాలకు పాల్పడిన 15 మందికి రూ.1,58,000 జరిమాన విధించామని సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శనివారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. యూత్ రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ జి.రవితేజ రెడ్‌క్రాస్ వలంటీర్లతో ప్రభుత్వ బోధనాసుపత్రి బ్లడ్‌బ్యాంకు వారి సమన్వయంతో దీన్ని చేపట్టారు. అనంతరం మావనహారం నిర్వహించారు. పలువురు రక్తదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే, ప్రభుత్వ బోధనాసుపత్రి వైద్యులు డాక్టర్ సుజాత, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కళాశాల మైదానంలో యోగా ట్రయల్‌రన్ నిర్వహించారు. ఆర్డీవో కృష్ణనాయక్ ముఖ్య అతిథిగా విచ్చేసి యోగాసనాల వచ్చే లాభాలను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మెంబర్ డాక్టర్ జీఎస్ మహాలక్ష్మి రెడ్‌క్రాస్ వలంటీర్ల విధివిధానాలు, రక్తదానంతో ప్రాణాలు పోయడం మనిషికి ఎంత సంతృప్తినిస్తుందో వివరించారు. ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్‌వీ గంగిరెడ్డి మాట్లాడుతూ తమ విద్యాసంస్థల్లో ఏ క్షణమైనా రక్తదానం చేయడానికి వలంటీర్లు సిద్ధంగా ఉంటారన్నారు. డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రాంబాబు రక్తదానానికి సంబంధించిన పలు విషయాలను వివరించారు. సందర్భంగా 67 సార్లు రక్తదానం చేసిన జీవీఎస్ నాగేశ్వరరావుకు ధన్వంతరీ బ్లడ్ బ్యాంకు డాక్టర్ కె.శ్రీనివాసమూర్తి జ్ఞాపిక అందించారు.

కొంకుదురులో సినిమా షూటింగ్


హీరో స్నానం చేస్తున్న దృశ్యాలను చిత్రీకరిస్తున్న యూనిట్

బిక్కవోలు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కొంకుదురు బుడతలమామిడి పరిసర ప్రాంతాల్లో నూతన చిత్ర నిర్మాణ సంస్థ నిర్మిస్తున్న ఇంకా పేరు పెట్టని చిత్రం షూటింగ్ శనివారం జరిగింది. క్యారెక్టర్ నటుడు అజయ్‌ఘోష్, నూతన నటుడైన హీరో తిరువీర్ తదితరులపై తుల్యభాగలో స్నానాలు చేస్తున్న సన్నివేశాలను చిత్రీకరించారు. హీరోయిన్‌గా పాయల్, అజయ్ ఘోష్, రఘుబాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నరేష్ దర్శకత్వం వహిస్తున్నారు. షూటింగ్ చూడడానికి అధిక సంఖ్యలో జనం తరలి వచ్చారు.

మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తే సహించం


ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

కోరుకొండ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాజానగరం నియోజకవర్గంలో మద్యం వ్యాపారులకు కొందరు ఎక్సైజ్ అధికారులు బెల్ట్‌షాపుల నిర్వహణలో కొమ్ముకాస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని, ప్రభుత్వ పాలసీకి వ్యతిరేకంగా మద్యం బెల్ట్‌షాపులు నిర్వహిస్తే సహించబోమని, అధికారులపై కూడా చర్యలు తప్పవని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. కోరుకొండలోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడి, గుడి ప్రాంతాల్లో మద్యం షాపులు నిర్వహించినా, ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా విక్రయించినా ఊరుకోబోమన్నారు. కూటమి ఏడాది పాలన సందర్భంగా మాట్లాడుతూ బ్లేడ్, గంజాయి బ్యాచ్‌లు, భూకబ్జాదారులు, మట్టి, ఇసుక దోపిడీదారులు, రౌడీ మూకలను ప్రభుత్వం సమర్థవంతంగా అదుపు చేసిందన్నారు. కూటమి పాలనలో టీడీపీ, జనసేన, బీజేపీలు కలిసి మెలసి ప్రయాణం చేస్తున్నాయన్నారు. తల్లికి వందనం పథకంలో అర్హులెవరికైనా నగదు జమ కాకపోతే సంబంధిత సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సోమవారం నుంచి జనవాణి, పల్లెబాట కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రోజంతా అదే గ్రామంలో ఉండి గ్రామ, వార్డు, ఇంటింట సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో జనసేన నాయకులు అడపా శ్రీనివాస్, అడ్డాల శివ, బదిరెడ్డి దొర, తెలగంశెట్టి శివ, నక్కా రాంబాబు, యర్రంశెట్టి పోలారావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వీఆర్వో మృతి

అనపర్తి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన పులగుర్త వీఆర్వో పలివెల వెంకటేశ్వరరావు(55) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. వెంకటేశ్వరరావు ఈ నెల 4న చెల్లూరు-మాచవరం రోడ్డులో జరిగిన ప్రమాదంలో గాయపడ్డారు. అప్పటి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో మృతిచెందారు. కాగా రాయవరం మండలం చెల్లూరుకు చెందిన వెంకటేశ్వరరావు 2013 నుంచి అనపర్తి, పులగుర్త గ్రామాల్లో వీఆర్వోగా విధులు నిర్వర్తించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, తహశీల్దార్ అనిల్‌కుమార్, వీఆర్వో అసోసియేషన్ అధ్యక్షుడు జి.శ్రీనివాస్ సంతాపం ప్రకటించారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కడియం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైను మరమ్మతుల నిమిత్తం ఈ నెల 16న వేమగిరి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో జేగురుపాడు ఫీడర్‌కు సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ జేపీబీ నటరాజన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.దీంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు కడియపుసావరం, జేగురుపాడు గ్రామాలకు సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.

దాహం.. దాహం..

కోరుకొండ మండలంలోని 10 గ్రామాల్లో దాహార్తి

- సక్రమంగా పనిచేయని సత్యసాయి మంచినీటి పథకం
- ప్రతి నెలా ఏదొక సమస్య
- 20 రోజులుగా తాగునీటి ఇబ్బందులు
- ప్రైవేటు వాటర్ ప్లాంట్లకు పెరుగుతున్న డిమాండ్


20 రోజులుగా తాగునీరు లేని సత్యసాయి వాటర్ ట్యాంకులు

కోరుకొండ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత మండు వేసవిలో తమకు తాగడానికి గుక్కెడు గోదావరి జలాలను సత్యసాయి మం చినీటి పథకం ద్వారా పంపిణీ చేయాలని కోరుకొండ మండలంలోని 10గ్రామాలకు చెందిన ప్రజలు ముక్తకంఠంతో ఇటు ప్రజాప్రతినిధులను, అటు అధికారులను వేడుకుంటున్నారు. సత్యసాయి మంచినీటి పథకం ద్వారా గోదావరి తాగునీటి జలాలు 6నెలలుగా సక్రమంగా రావడంలేదు. కనీసం 20 రోజులకు ఒక్క సారి కూడా తాగు నీరు రావడం లేదు. ఒక నెలలో సిబ్బందికి జీతాలు లేవని, మరో నెలలో పైపులు పగిలాయని, ఇంకో నెలలో విద్యుత్ సమస్య అని ఇలా ప్రతి నెలా ఏదొక సమస్య చెబుతున్నారు. మార్చిలో రెండు సార్లు, ఏప్రిల్‌లో రెండు సార్లు, మే నెలలో రెండు రోజులు మాత్రమే మంచినీళ్ల ఇచ్చారు. ప్రస్తుతం జూన్‌లో 14 రోజులు గడుస్తున్నా సత్యసాయి పథకం ద్వారా గ్రామాల్లో తాగు నీరు అందించడం లేదు. ఈ క్రమంలో 6 నెలల కాలంలో ప్రైవేట్ మంచి నీటి వ్యాపారం విపరీతంగా పెరిగింది. గోదావరి జలాలు రాకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులు అమ్మే మినరల్ వాటర్‌ను కొనుగోలు చేసుకోవడం తప్ప ప్రజలకు గత్యంతరం లేదు. ఈ నేపథ్యంలో మండలంలో మంచినీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. అన్ని గ్రామాల్లోను 2, 3 ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌లు వెలిశాయి. కాగా ప్రతి గ్రామంలో రెండు మూడు మంచి నీటి ట్యాంకులు ఉండి కూడా ప్రభుత్వ యంత్రాంగం ప్రజలకు సక్రమంగా తాగు నీటిని సరఫరా చేయలేకపోతోందని మండల ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా స్పందించి సత్యసాయి మంచినీటి పథకం ద్వారా గోదావరి జలాలను సరఫరా చేయాలని ఆయా గ్రామాల వారు కోరుతున్నారు.


అవార్డును అందుకుంటున్న అడిషనల్ డీజీ దినేష్

ఏపీ నాక్‌కు గోల్డ్ అవార్డు

రాజమహేంద్రవరం రూరల్ జూన్ 14(ఆంధ్రజ్యోతి): కనస్ట్రక్షన్ సెక్టార్‌లో ఉత్తమ నైపుణ్య శిక్షణ ఇస్తున్న ఆంధ్రప్రదేశ్ నాక్‌కు ఇన్‌ఫ్రాస్ట్రెక్చర్ స్కిల్ డెవలప్మెంట్ అకాడమీ ఢిల్లీ నుంచి గోల్డ్-2025 అవార్డు లభించింది. ఈ మేరకు శనివారం ఢిల్లీలో ఏపీ నాక్ అడిషనల్ డీజీ దినేష్‌కుమార్ ఈ అవార్డును కేంద్ర స్టేట్ కోఆపరేటివ్ అఫైర్స్, రోడ్డు అండ్ ట్రాన్స్‌పోర్టు, అండ్ హైవే అథారిటీస్ మంత్రి హర్ష్ మల్హోత్రా చేతుల మీదుగా అందుకున్నారు. ఈ మేరకు రాజమహేంద్రవరం రూరల్ పరిధిలోని నాక్ సెంటర్ ప్రతినిధులు ఒక ప్రకటన విడుదల చేశారు.


నన్నయ వర్శిటీలో యోగా సాధనలో వీసీ ప్రసన్నశ్రీ


అనపర్తిలో యోగా సాధనలో ఎమ్మెల్యే నల్లమిల్లి


పందలపాక హైస్కూల్లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

యోగాతో ఆరోగ్యం

- 18న నన్నయలో మెగా యోగాంధ్ర
- ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ
- పలుచోట్ల యోగాసనాల సాధన

దివాన్‌చెరువు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా దోహదపడుతుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. యోగాంధ్ర-2025 కార్యక్రమంలో భాగంగా నన్నయ వర్శిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్ భవనంలో శనివారం బోధన, బోధనేతర సిబ్బందికి యోగాగురువు ఎన్.శివశంకర్ ప్రాణాయామం, యోగాసనాలను సాధన చేయించారు. కార్యక్రమానికి విచ్చేసిన వీసీ మాట్లాడుతూ వన్‌ఎర్త్-వన్ హెల్త్ నినాదంతో అందరూ యోగసాధన చేయాలన్నారు. యూనివర్శిటీ స్థాయిలో ఈ నెల 18న మెగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంతో బాటు అనుబంధ కళాశాలలు ఇందులో భాగస్వామ్యమై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. వర్శిటీ అధికారులు,అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ పీవోలు, కళాశాలల యాజమాన్యాలు యోగాంధ్ర కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, వర్శిటీ అధికారులు పాల్గొన్నారు.

కడియం: కడియం పంచాయతీ కార్యాలయం వద్ద యోగాంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ మాట్లాడుతూ మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవాలని, ప్రతిఒక్కరు యోగా, ధ్యానం చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉపసర్పంచ్ వెలుగుబంటి రఘురామ్(నాని), చిలుకూరి ప్రభాకర్, ఎంపీ డీవో కె.రమేష్, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సీతానగరం: బొబ్బిల్లంక హైస్కూల్ వద్ద ప్రధానోపాధ్యాయుడు కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో యోగాంధ్ర సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో స్వామినాయక్ ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఫిజికల్ డైరెక్టర్ శీలం వీరబాబు, హిందీ టీచర్ రేష్మ పర్యవేక్షణలో విద్యార్థులు, గ్రామస్థులతో యోగా సాధన చేయించారు. ఈ సందర్భంగా ఎంఈవో యోగా ఆవశ్యకతను వివరించారు. పాఠశాల, సిబ్బంది, కూటమి నాయకులు, పలు శాఖల ఉద్యో గులు, సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సభ్యులు పాల్గొన్నారు. అలాగే సీతానగరం సచివాలయం వద్ద వీఆర్వో నందీశ్వరరావు, డిజిటల్ అసిస్టెంట్ ఫణి ఆధ్వర్యంలో మహిళలకు యోగా క్లాసులు నిర్వహించారు.

బిక్కవోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో వి.శ్రీనివాస్, తహశీల్దార్ సత్యకృష్ణ, డ్వాక్రా మహిళలు, ఇతర శాఖల అధికారులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈ నెల 21న విశాఖలో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొంటారని, దానిలో పాల్గొనడానికి ప్రతిఒక్కరికీ యోగా ప్రక్రియలపై అవగాహన ఉండాలన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు, విద్యా సంస్థల్లో అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు.

రంగంపేట: స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఎంపీడీవో వీవీ సాయిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమానికి మండల ప్రత్యేకాధికారి బీవీ గిరి ముఖ్యతిథిగా విచ్చేసి మాట్లాడారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి నిరంతరం యోగాభ్యాసాలు చేయాలని సూచించారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, నాయకులు వీవీవీ మాణిక్యం, వి.గిరిబాబు, మండవిల్లి గుప్త, బి.ప్రసాద్, పోతుల చిన్నికాపు, పీహెచ్‌సీ వైద్యాధికారిణి బి.వేణుశ్రీలక్ష్మి, వెలుగు ఏపీఎం అబ్బులు, కార్యదర్శి వి.శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యోగాను ఆచరించాలి: నల్లమిల్లి

అనపర్తి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రాచీన సంస్కృతిలో భాగమైన యోగా ప్రక్రియను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. యోగాంధ్రలో భాగంగా అనపర్తి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాను ప్రపంచ వ్యాప్తం చేయాలన్న సంకల్పంతో ప్రధాని మోదీ జూన్ 21వ తేదీని ప్రపంచ యోగా దినోత్సవంగా నిర్వహించుకునేలా చేశారన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీవో రామకృష్ణారెడ్డి, ఇతర శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


కడియంలో యోగాసనాలు వేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


బొబ్బిల్లంక హైస్కూల్లో యోగాసనాలు వేస్తున్న దృశ్యం


రంగంపేటలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం

యోగాతో మానసిక ప్రశాంతత: ఏఎస్పీ సుబ్బరాజు

పోలీసుల సామూహిక యోగా


జిల్లా పోలీసు కార్యాలయం వద్ద యోగాసనాలు వేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): యోగా కేవలం ఆరోగ్యం గురించే కాకుండా మానసిక ప్రశాంతతకు, ఒత్తిడిని నియంత్రించడానికి ఉపకరిస్తుందని అడిషనల్ ఎస్పీ (శాంతి భద్రతలు) ఏవీ సుబ్బరాజు అన్నారు. యోగా మాసోత్సవాల్లో భాగంగా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో సాయుధ రిజర్వు, సివిల్ పోలీసులు శనివారం సామూహిక యోగా సాధన చేశారు. పోలీసు ఉద్యోగం చేసే వారికి యోగా ఆవశ్యకత ఎంతో ఉందని ఏఎస్పీ అన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎల్.చెంచిరెడ్డి, ఏఆర్ డీఎస్పీ రవికుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

తల్లికి వందనంతో నగదు జమ


నిధులు జమయిన తల్లులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటై యేడాదైన సందర్భంగా ఈ నెల 12న 67 లక్షల మంది తల్లులకు తల్లికి వందనం పేరుతో రూ.10 వేల కోట్లు జమ చేసినట్టు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. బలభద్రపురంలో తల్లికి వందనం నిధులు జమయిన తల్లులను ఆయన శనివారం కలిసారు. ఈ సందర్భంగా వారు గత ప్రభుత్వంలో ఒకరికే అమ్మఒడి కింద మూడేళ్ల ఇచ్చారని, చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ రూ.13 వేలు చొప్పున జమ చేయడం ఎంతో ఆనందంగా వుందని వారు చెప్పారు. కాగా ఈ నెల 20న అన్నదాత సుఖీభవ, ఆగస్టు 15న మహిళల ఉచిత బస్సు పథకాలను ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఇన్ని సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్న వైసీపీ వారు ఓర్వలేక, అసూయతో నిందలు వేయడం తగదని ఆయన అన్నారు. ఈయన వెంట కూటమి నాయకులు నల్లమిల్లి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సామాజిక పుస్తకాలు చదవాలి

మాజీ ఎంపీ మిడియం బాబూరావు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పాఠ్యపుస్తకాలతోపాటు సామాజిక పుస్తకాలు చదవాలని మాజీ ఎంపీ మిడియం బాబూరావు అన్నారు. బాలాజీదాస్ విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ సహకారంతో నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లలో చదువుకునే ప్రతి విద్యార్థికీ మంచి చదువు అందించాలనే ఉద్దేశ్యంతోనే వేసవి శిక్షణా తరగతులు నిర్వహించినట్టు చెప్పారు. ట్రస్టు బోర్డు సభ్యుడు టి.అరుణ్, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి బి.పవన్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా, శిక్షణా తరగతుల్లో బోధించిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ న్యాయవాదిగా సింగ్ సురేంద్ర నియామకం

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులైన సింగ్ సురేంద్రప్రసాద్‌ను ఎస్సీఎస్టీ, బీసీ,మైనార్టీ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ సత్కరించింది. శనివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో అభినందన సభను నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది మర్రి బాబ్జీ మాట్లాడారు. సురేంద్ర నియామకం వల్ల పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. సంఘం ముఖ్యసలహాదారుడు కాశీ నవీన్‌కుమార్ మాట్లాడుతూ సురేంద్ర నియామకం పట్ల సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిలకు ధన్యవాదాలు తెలిపారు.

గన్ని కృష్ణ పరామర్శ

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ పరామర్శించారు. శ్రీనివాసరావు తండ్రి సింహాచలం ఇటీవల మృతిచెందారు. ఈ నేపథ్యంలో శనివారం గన్ని కృష్ణ విశాఖపట్నంలోని పల్లా నివాసానికి వెళ్లి సింహాచలం చిత్రపటానికి నివాళులర్పించి శ్రీనివాసరావును పరామర్శించారు. ఈ సందర్భంగా గన్ని వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.


మౌనం పాటిస్తున్న భరత్‌రామ్ తదితరులు

విమాన ప్రమాద మృతులకు

మాజీ ఎంపీ భరత్ సంతాపం

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మృతిచెందిన వారికి మాజీ ఎంపీ, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. స్థానిక వైసీపీ సిటీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విమాన ప్రమాద మృతులకు సంతాపంగా రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ ఈ దుర్ఘటన అందరి హృదయాలను కలచివేసిందన్నారు. కార్యక్రమంలో ఉభయ రాష్ట్రాల బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దోపిడీకి వెళ్లి.. గంజాయితో చిక్కి! 3

కొవ్వూరులో ఏడుగురి అరెస్టు

నీట్.. కొట్టారు!

నీట్ 2025 ఫలితాలు విడుదలయ్యాయి.. ఐఐటీ అండ్ మెడికల్ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు.. తిరుమల విద్యార్థి దర్బా కార్తీక్ రామ్‌కిరీటి ఆలిండియా 19వ ర్యాంక్, స్టేట్ 1వ ర్యాంక్ సాధించాడు. చాగల్లుకు చెందిన కొడవటి మోహిత్ శ్రీరామ్ ఆలిండియా స్థాయిలో 56వ ర్యాంకు.. రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్ సాధించాడు. ఇలా పలువురు విద్యార్థులు మెరిశారు. నీట్‌ను సాధించారు. ఎంబీబీఎస్ చదవాలనే తమ కలను నిజం చేసుకున్నారు. తల్లిదండ్రుల ఆశకు ఊపిరి లూదారు. పలువురు ఐఐటీలో సీటు సాధించారు.

అమ్మానాన్న కష్టం చూసి చదివా..



నా పేరు కొడవటి మోహిత్ శ్రీరామ్.. మాది చాగల్లు..నాన్న సత్యనారాయణ, తల్లి నవీన.. మాది వ్యవసాయ కుటుంబం.. నన్ను ఉన్నత స్థానంలో చూడాలనే కష్టపడి చదివించారు. వారి కష్టానికి విలువ ఇవ్వాలని కదా.. ఆ కష్టమే నన్ను బాగా చదివేలా చేసింది. శనివారం విడుద లైన నీట్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 56వ ర్యాంకు రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకు సాధించా. గతంలో ప్రకటించిన ఏపీఈఏపీ సెట్‌లో 9వ ర్యాంకు సాధించా. డాక్టర్ కావాలనే నా కల నిజం చేసుకుంటున్నా.

- కొడవటి మోహిత్ శ్రీరామ్, చాగల్లు

యోగాంధ్రకు 7.66 లక్షల మంది నమోదు : కలెక్టర్

రాజమహేంద్రవరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యోగాంధ్ర మాక్ యోగా సాధనలో భాగస్వాములు కావడానికి 7 లక్షల 66 వేల మంది తమ పేర్లు నమో దు చేస్తున్నారని కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్న రాముడు తెలి పారు. ఈ నెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్స వాన్ని పుర స్కరించుకొని శనివారం ట్రయల్ రన్ నిర్వహించామన్నారు. జిల్లాలో 2 మునిసిపాలిటీలు, ఒక మునిసిపల్ కార్పొరేషన్, 300 గ్రామ పంచాయతీలు, ముఖ్య కూడళ్లు, పాఠశాలలు, కళాశాలలు, యూనివర్శిటీలు తదితర 1645 ప్రదేశాల్లో 1,06,847 యోగా సాధన నిర్వహిం చామ న్నారు. యోగా దినోత్సవం రోజున 4889 ప్రాంతాల్లో సాధన చేసేలా చర్యలు తీసు కుంటున్నామ న్నారు. యోగాంధ్ర సాధనకు విశేష స్పందన లభిస్తోందన్నారు.యోగా మాసోత్సవాల్లో భా గంగా ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశాలతో జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో సాయుధ రిజర్వు,సివిల్ పోలీసులు శనివా రం సామూహిక యోగా సాధన చేశారు.



జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసుల యోగాసనాలు



పట్టు పట్టారు!

ఉప్పాడ టు చేనేతకు టు చేయూత

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉప్పాడ అంటే చేనేత..రంగురంగుల చీరలు.. మోడళ్లు.. వీటిపై మనసుపారేసుకోని మహిళలంటూ ఉండరు.. ఎక్కడో హైదరాబాద్, విశాఖ నుంచి ఎందరో ప్రముఖులు ఇక్కడకు వచ్చి చీరలు కొనుగోలు చేస్తారు. సినీ సెలబ్రిటీలు సైతం తమ ఇళ్లల్లో వివాహాలు, ఇతర శుభ కార్యాలకు ఇక్కడి నుంచే చీరలు తీసుకెళతారు. ఏటా రూ.30 కోట్ల వరకు జరిగే ఈ వ్యాపారానికి ప్రోత్సాహం అందిస్తే చేనేత వ్యాపారం ఎదిగే అవకాశం ఉంది. అటు చేనేత కార్మికులకు సైతం మేలు జరగనుంది. ఈ నేపథ్యంలో ఉప్పాడ చేనేతకు మరింత చేయూత నందించి ఆధునిక డిజైన్లలో చీరలు తయారు చేసేలా ప్రభుత్వం తోడ్పాటు అందించబోతోంది. ఈ మేరకు రూ.15 కోట్లతో చేనేత అభివృద్ధి క్లస్టర్ ఏర్పాటుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. తన సొంత నియోజకవర్గం కావడంతో పవన్ సైతం కేంద్రంతో మాట్లా డుతున్నారు. త్వరలో నిధులు విడుదలయ్యే అవకాశం ఉన్నట్టు చేనేత శాఖ అధికారులు చెబుతున్నారు.

1600 కుటుంబాలకు ఆధారం

ఉప్పాడ అంటే చేనేత చీరలకు ప్రసిద్ధి. చెన్నై నుంచి మేలురకం నూలు తీసుకు వచ్చి ఇక్కడ మగ్గాలపై నేత కార్మికులు రక రకాల చీరలు నేస్తారు.ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మంచి పేరుంది. ఉప్పాడ, పిఠాపురం, గొల్లప్రోలులో దాదాపు 1600 చేనేత కుటుంబాలు ఉండగా వీరిలో అనేక మంది పట్టు, జాంధానీ చీరలను మగ్గాలపై నేస్తారు. ఉప్పాడలో రెండు చేనేత సంఘాలు వీటిని తయా రుచేసి విక్రయిస్తాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కొత్తగా చేనేత ప్రోత్సాహానికి పథకం ప్రారంభించింది. నీడ్ బేస్డ్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ ప్రాజెక్టు కింద ఉప్పాడ చేనేత క్లస్టర్ ప్రాజెక్టును ప్రతిపాదించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అటు పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ అయినందున ఇక్కడ చేనేతను మరింత ప్రోత్సహించాలని పట్టుదలగా ఉన్నారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ప్రత్యేక ఆసక్తి కనబర్చి కేంద్రానికి ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించారు.ఈ మేరకు ఉప్పాడలో 916 మంది ఇళ్లకు నేరుగా వెళ్లి ఇటీవల చేనేతశాఖ అధికారులు అభిప్రాయాలు సేకరించారు. మొత్తం రూ.15 కోట్ల ప్రాజెక్టుకు సంబంధించి కేంద్రం వాటాగా రూ.11.85 కోట్లు ఇవ్వనుంది. మిగిలిన రూ.3.15 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది. ఇటీవల రాష్ట్ర చేనేత కమిషనర్ రేఖారాణి ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్ర చేనేత శాఖకు పంపించారు. ఈ ప్రాజెక్టుపై పవన్ సైతం కేంద్రంతో మాట్లాడుతున్నారు. త్వరలో నిధులు విడుదల కానున్నాయని కాకినాడ కలెక్టర్ వివరించారు.

- ఇన్నేళ్లకు మంచి రోజులు
- 15 చోట్ల చేనేత క్లస్టర్లు
- రూ.15 కోట్లతో ప్రతిపాదనలు
- త్వరలో నిధుల విడుదల
- ప్రాజెక్టుపై పవన్ సంప్రదింపులు
- నేతన్నలకు ఆధునిక శిక్షణ
- మారనున్న పిఠాపురం చిత్రం

ఇలా చేస్తారు..

ప్రాజెక్టు అభివృద్ధి కింద పిఠాపురం నియోజకవర్గంలో 15 చోట్ల చేనేతను ప్రోత్సహించడానికి పలు అంశాలు ప్రతిపాదించారు. ఉప్పాడలో రూ.1.40 కోట్లతో పనులు చేయబోతున్నారు. రూ.80 లక్షలతో క్వాలిటీ టెస్టింగ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. రూ.60 లక్షలతో మెగా షోరూం ఏర్పాటు చేసి చీరలు విక్రయిస్తారు. యు.కొత్తపల్లిలో రూ.కోటితో డిజైన్ స్టూడియో నిర్మిస్తారు. రూ.80 లక్షలతో చీరలు, జాకెట్లు, ఇతర వస్త్రాలు కుట్టేలా యూనిట్ నిర్మించనున్నారు.తాటిపర్తిలో రూ.55 లక్షలతో శారీ స్క్రీన్ పెయింటింగ్ సెంటర్ నిర్మించనున్నారు. రూ.50 లక్షలతో షోరూం నిర్మిస్తారు. రూ.60 లక్షలతో షాప్ అండ్ షాప్ కింద పాడుబడ్డ చేనేత సంఘం భవనాలు ఆధునీకీకరిస్తారు. చేబ్రోలులో నూలుకు రంగులు అద్దే యూనిట్ రూ.2.50 కోట్లతో ఏర్పాటు చేయనున్నారు. రూ.50 లక్షలతో షోరూం కట్టనున్నారు. దుర్గాడలో రూ.80 లక్షలతో గార్మెంట్ మేకింగ్ యూనిట్ స్థాపించాలని ప్రతిపాదించారు. చెందుర్తిలో రూ.55 లక్షలతో శారీ స్క్రీన్ ప్రింటింగ్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. గొల్లప్రోలులో రూ.50 లక్షలతో హోం ఫర్నీషింగ్ యూనిట్ స్థాపించనున్నారు. మొత్తం రూ.12 కోట్లతో చేనేతకు సంబంధించి ఆధునిక మోడళ్లలో చీరలు, జాకెట్లు డిజైన్ చేయడం, రక రకాల స్క్రీన్ ప్రింటింగ్‌లు అందుబాటులోకి తేనున్నారు. రూ.1.50 కోట్లతో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి జిల్లాలో చేనేత కార్మికులు, మహిళలకు ఆధునిక మోడళ్లపై శిక్షణ ఇస్తారు. దేశంలో ప్రముఖ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (ఎన్ఐఎఫ్‌టీ)ల నుంచి ప్రముఖ డిజైనర్లను ఉప్పాడ తీసుకు వస్తారు. నిపుణులతో రెండేళ్లపాటు శిక్షణ ఇప్పించనున్నారు. ఇందుకు రూ.3 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేశారు.



బై..బై.. వైసీపీ!

కూటమి వైపు.. ఫ్యాన్స్ చూపు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ప్రతిపక్ష వైసీపీ రెక్కలూడిపోతున్నాయి. ఇప్పటికే ఒక్కొక్కరుగా పార్టీ మారిపోతున్నారు. అవకాశమిస్తే క్యూకట్టేలా ఉన్నారు. వైసీపీ తన వైఖరి వల్లే ప్రజల్లో మరింత వ్యతిరేకత తెచ్చుకుంటోంది. ఇటీవల అమరావతిపై సొంత ఛానల్‌లో అక్కసు వెళ్లగక్కడమే అందుకు ఉదాహరణ. అమరావతి రాజధానిపై సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కృష్ణంరాజు అనే జర్నలిస్టు చేసి వ్యాఖ్య తీవ్ర పరిణామాలకు దారి తీసిన సంగతి తెలిసిందే. గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు నేతలు చేసిన పనులు, కొందరు కార్యకర్తలు, అధినేత జగన్ వ్యవహార శైలి ఆ పార్టీకి తీవ్ర నష్టం తెచ్చిన సంగతి తెలిసిందే. దీంతో గత సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వైసీపీ తుడుచుపెట్టుకుపోయింది. ఇటీవల జరిగిన టీచర్స్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ వైసీపీ ఊసే వినిపించలేదు. దీంతో నేతలతోపాటు, కార్యకర్తలు దిగాలు పడుతున్నారు. దీనికితోడు స్థానిక సంస్థలైన పంచాయతీలు, మునిసిపాలిటీలు, జడ్పీల్లోనూ ఉన్న వైసీపీ ప్రతినిధులు నెమ్మదిగా జారుకుం టున్నారు. ఇప్పటికే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని పలువురు జడ్పీటీసీలు, సర్పంచ్‌లు కూటమిలో చేరారు. పిఠాపురంలో వైసీపీ నేత జనసేనలో చేరిపోయారు. తుని మునిసి పాలిటీ టీడీపీ వశమైంది. కొవ్వూరు మునిసిపల్ చైర్మన్ వైసీపీకి రాజీనామా చేశారు. టీడీపీలో చేరనున్నారు. నిడదవోలు మునిసిపాలిటీ జనసేనకు దక్కింది. ఇంకా అనేక మంది పార్టీ మారాలని చూస్తున్నా ఇటు ఆమోదం లభించడంలేదు.

రానున్నాయి.. స్థానిక ఎన్నికలు!

మునిసిపల్ పాలకవర్గాలకు 2021 మార్చి 10న ఎన్నికలు జరిగాయి. 18వ తేదీన చాలా ప్రమాణ స్వీకారాలు జరిగాయి. ఈ ఏడాది మార్చి 18తో పాలకవర్గాలకు నాలుగేళ్లు నిండిపోయాయి. 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అప్రజాస్వామికం, దౌర్జన్యంగా వ్యవహరించడంతో అన్ని మునిసిపాలిటీల్లోనూ వైసీపీ గెలిచిన సంగతి తెలిసిందే. దీంతో అధికారం వైసీపీ వశమైంది. మొత్తం 12 మునిసిపాలిటీల్లో అప్పట్లో టీడీపీకి 50 మంది కౌన్సిలర్లు, జనసేనకు 18 మంది, బీజేపీకి 8, కాంగ్రెస్‌కు ఒకటి, వైసీపీకి 319 వచ్చాయి. వీరిలో ఇప్పటికే చాలా మంది పార్టీ మారారు. గ్రామ పంచాయతీలకు 2021 ఫిబ్రవరి 9 నుంచి 21వ తేదీ వరకూ ఎన్నికలు 4 దశల్లో జరిగాయి. ఆ ఎన్నికల్లో వైసీపీకి 805, టీడీపీ, మిత్రపక్షాలకు 143 సర్పంచ్ పదవులు లభించాయి. 805 మందిలో ఇప్పటికే చాలామంది కూటమిలో చేరారు. జడ్పీ ఎన్నికలకు 2021 ఏప్రిల్ ఒకటో తేదీనే ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వడంతోపాటు కేవలం 8వ తేదీనే పోలింగ్ జరిగేటట్టు ప్రకటించడం వివాదాస్పదమైంది. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం కనీసం నాలుగు వారాలు గడువుతో ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వాలి. కేవలం ఒకటో తేదీనే నోటిఫికేషన్ ఇచ్చి 8న పోలింగ్ తేదీ అని చెప్పడంతో ఇబ్బంది అయింది. అయినా వైసీపీ మొండిగా ఎన్నికలు నిర్వహించింది. కోర్టు వివాదాల నేపథ్యంలో 2021 సెప్టెంబరు 19న ఫలితాలు ప్రకటించారు. కానీ టీడీపీ అధికారంలోకి రావడంతో వైసీపీ జడ్పీసీలంతా స్తబ్దుగా ఉన్నారు. జిల్లాలు విడిపోయినా.. జడ్పీ విభజన జరగలేదు. ఇప్పటికే చాలామంది జడ్పీటీసీలు కూటమిలో చేరగా, కొందరు జడ్పీటీసీలు సైలెంట్ అయ్యారు. ప్రస్తుతం కూటమి నేతలతో టచ్‌లో ఉన్నారు. పార్టీ మారేందుకు సిద్ధమంటున్నారు.

వస్తామన్నా.. వద్దు : చంద్రబాబు

ఇటీవల టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ ఎమ్మెల్యేలకు ఒక వర్తమానం పంపారు. వైసీపీ నుంచి వచ్చే వారిని ఇష్టానుసారం పార్టీలో చేర్చుకోవద్దని.. ముందు తమకు సమాచారం ఇచ్చి.. ఆమోదం పొందిన తర్వాతే చేర్చుకోవాలని చెప్పడం గమనార్హం. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ కూడా ఈ విషయాన్ని బహిరంగంగానే ప్రకటించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో చాలామంది వైసీపీ నేతలు కూటమిలో చేరడానికి ప్రయత్నాలు చేస్తున్నా రెడ్ సిగ్నల్ ఉంది. పైగా ఎమ్మెల్యేలకు ఆయా మునిసిపాలిటీలు, స్థానిక సంస్థల్లో అక్రమాలకు పాల్పడి ప్రజల్లో చెడ్డపేరు తెచ్చుకున్నవారిని చేర్చుకోవడానికి ఇష్టపడడం లేదు. కొందరు వస్తామన్నా వద్దని చెబుతున్నారు. ఇతరులను లాక్కోవడానికి ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. వచ్చే ఏడాది వరకూ స్థానిక సంస్థల ఎన్నికలకు గడువు ఉంది. కానీ నాలుగేళ్లు పూర్తవడంతో మునిసిపల్ చైర్మన్లు, సర్పంచ్‌లు, జడ్పీ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానాలు పెడుతున్నారు. ఎందుకంటే వచ్చే ఫిబ్రవరికి సర్పంచ్‌లకు ఐదేళ్లు నిండిపోతాయి. వచ్చే మార్చి నాటికి మునిసిపల్ పాలకవర్గాల గడువూ ముగిసిపోతోంది. 2026 సెప్టెంబరు నాటికి జడ్పీటీసీలకు ఐదేళ్లు పూర్తవుతాయి. ఇంతలో కంగారు ఎందుకనేలా కూటమి నేతలు ఉన్నారు. ఎక్కువమంది టీడీపీ, జనసేన వైపే మొగ్గు చూపుతున్నారు. కానీ గ్రీన్ సిగ్నల్ అందడం లేదు. ఈ ఏడాది డిసెంబర్ నుంచే స్థానిక ఎన్నికల సందడి మొదలు కావచ్చు.

- పార్టీ మారేందుకు నేతలు సిద్ధం
- క్యూ కడుతున్న వైసీపీ నాయకులు
- అయినా అంగీకరించని టీడీపీ
- ఆమోదం తరువాతే చేరికలు
- సీఎం చంద్రబాబు వర్తమానం
- డిసెంబరులోనే స్థానిక ఎన్నికలు



పుష్కరాల నిర్వహణపై రౌండ్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు, ప్రముఖులు

పుష్కరాలు విజయవంతం చేస్తాం

రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : 2027లో జరగబోయే గోదావరి పుష్కరాలను అన్ని వర్గాల సహకారంతో విజయవంతం చేస్తామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు.ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో శనివారం రాజమహేంద్రవరంలోని ఛాంబర్ భవనంలో గోదావరి పుష్కరాలు, నగర సమగ్ర అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై శనివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రోన్ల సమీకృత సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసి సమర్థవంతంగా వినియోగించుకుంటామన్నా రు. చిరువ్యాపారులకు నష్టం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపిక చేసిన ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా సామూహిక వ్యాపారం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. గోదావరి నదీతీరంలో ఎక్కడ స్నానమాచరించినా పుణ్యమే అన్న విషయాన్ని భక్తుల్లో విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. గోదావరి పుష్కరాలను రాజకీయాలకు అతీతంగా నిర్వహించాలని వైసీపీ కేంద్ర కమిటీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. గత పుష్కరాల్లో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. పుష్కరాల్లో భాగంగా చిరు వ్యాపారులకు నష్టం కలిగే చర్యలు తీసుకోకూడదని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. మూడు పాత మేజర్ డ్రైనేజీలను ఎస్టీపీ ప్లాంట్‌కు అనుసంధానించాలి అని సూచించారు. పవిత్ర గోదావరిలో స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఘాట్ల మార్గాలను సూచించే బోర్డులను ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకుడు కంటిపూడి సర్వారాయుడు సూచించారు. గోదావరి పుష్కరాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెద్ద ఎత్తున వినియోగిస్తాం అని ఆర్డీవో కృష్ణనాయక్ అన్నారు. 2027 పుష్కరాలను విజయవంతం చేస్తామని కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. చిరు వ్యాపారులకు నష్టం కలగకుండా మెయిన్‌రోడ్డుకు అనుసంధానంగా ఉన్న రోడ్లను అభివృద్ధి చేయాలని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు తవ్వా రాజా అన్నారు. పుష్కరాల సమయంలో ముఖ్యంగా శానిటేషన్‌పై దృష్టిపెట్టాలి. చిరువ్యాపారులను ఇబ్బందిపెట్ట కూడదు అని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు తాటిపాక మధు, టి.అరుణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ సుబ్బరాజు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ తిలక్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, రుడా మాజీ చైర్‌పర్సన్ ఎం.షర్మిలారెడ్డి, కాంగ్రెస్ నాయకులు అసదుల్లా అహ్మద్, నందెపు శ్రీనివాస్, వై.శ్రీను, జామి సత్యనారాయణ, కాశి నవీన్‌కుమార్, నల్లం శ్రీను పాల్గొన్నారు.



కొవ్వూరులో యోగాంధ్ర

కొవ్వూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవన విధానంలో ఒక భాగం చేసుకోవాలని కలెక్టర్ ప్రశాంతి సూచించారు. కొవ్వూరు గోష్పాదక్షేత్రం ప్రధాన ఘాట్‌లో శనివారం ఆర్డీవో రాణి సుస్మిత పర్యవేక్షణలో మాక్ యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా గురువు సరోజ యోగాసనాలు వేయించారు. బ్రహ్మకుమారీస్ సోదరి రాజయోగ ధ్యానం చేయించారు.కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ జూన్ 21వ తేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మాక్ యోగాంధ్రను చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 7 లక్షల 64 వేల మంది యోగాంధ్ర యాప్‌లో రిజిస్టర్ అయ్యారన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల ఆదేశాల మేరకు గత నెల రోజులుగా యోగాపై గ్రామ స్థాయి నుంచి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఏడు పదుల వయసు దాటినా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు అంత ఉత్సాహంగా ఉండడానికి కారణం యోగా అన్నారు.జేసీ ఎస్.చిన్న రాముడు మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున ప్రపంచంలోనే రికార్డు సాధించబోతున్నామన్నారు. ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ యోగా ద్వారా మానసికోల్లాసం, కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, పట్టణ సీఐ పి. విశ్వం, మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, పట్టణ టీడీపీ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, కమిషనర్ టి. నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో మాక్ యోగాంధ్ర.. మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం : కలెక్టర్

రాజమహేంద్రవరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2100 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం అందిస్తున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఈ నెల 25లోపు జిల్లాలోని చిన్న/సన్నకారు రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గత ఆర్థిక సంవత్సరంలో 500 ఎకరాలు లక్ష్యంగా నిర్దేశించుకోగా 643 ఎకరాల్లో పెంపకం చేపట్టడం జరిగిందన్నారు. పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించడం కోసం మామిడి, జీడి మామిడి, ఆయిల్ పాం, డ్రాగన్ ఫ్రూట్, నిమ్మ, బత్తాయి, కొబ్బరి, సపోటా, సీతాఫలం, కోకో తదితర 26 పంటలను అనుమతిస్తామన్నారు. పండ్ల రకాల ఆధారంగా ఎకరాకు మూడేళ్లకు రూ.68,103 నుంచి రూ.2,51,226 వరకూ లబ్ధి చేకూరే అవకాశం ఉందన్నారు. దరఖాస్తులను గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలన్నారు. అవకాశాన్ని పండ్ల సాగు చేసే రైతులు సద్వినియోగం చేసుకో వాలని డ్వామా పీడీ ఎం.నాగమల్లేశ్వ రరావు కోరారు.

ఏటీఎస్ సెంటర్‌కు వ్యతిరేకంగా

1న చలో రాజానగరం

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): వాహనాల ఫిట్‌నెస్ ధ్రువీకరణను ప్రైవేట్ సంస్థ లకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ జూలై 1న చలో రాజానగరం నిర్వహిస్తున్నామని ఆటో, కార్ లారీ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు వాసంశెట్టి గంగాధరరావు, బొలిశెట్టి బాక్స్ ప్రసాద్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం కంబాలచెరువు వద్ద ఉన్న బెలూన్ మినీ ఫంక్షన్ హాలులో శనివారం విలేకరులతో మాట్లాడారు. వాహనాల ఫిట్‌నెస్ విషయంలో కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించి ఏటీఎస్ సెంటర్లను ఏర్పాటు చేసిందన్నారు. ఎంవీఐ తనిఖీ చేసి వాహనాల ఫిట్‌నెస్ జారీ చేయాల్సిన చోట ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం సరికాదన్నారు. ఏటీఎస్ సెంటర్‌లో వాహనాలు తనిఖీచేసే మిషనరీ పవర్‌కు ఇంజన్లు దెబ్బతింటున్నాయన్నారు. ఆన్‌లైన్‌లో వాహనాల ఫిట్‌నెస్‌కు చిన్నవాహనానికి రూ. 920, పెద్దవాహనాలకు రూ .1320 కట్టించుకుంటున్నారని అది కూడా సుమారు 6 గంటలు పైబడి ప్రోసెస్ నడుస్తుందన్నారు.అప్పుడు గుజరాత్‌లో కార్మిక సంఘాల డిమాండ్ మేరకు ఆర్‌టీవో కార్యాలయంతో పాటు ఎటీఎస్ కూడా అమలు చేశారని చెప్పారు.ఇదే విధానం ఏపీలో కూడా అమలుచేయాలన్నారు.జూలై 1న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జిల్లాలో ఆటోలు, లారీలు, కార్లు తిరగకుం డా శాంతియుతంగా ఏటీఎస్ సెంటర్‌కు చేరుకుని నిరసన చేస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వాసంశెట్టి గంగాధరరావు, బాక్స్ ప్రసాద్ తదితరులు

వేగేశ్వరపురంలో ఎస్సీ కమిషన్ చైర్మన్ పర్యటన


మాట్లాడుతున్న చైర్మన్ జవహర్, తదితరులు

తాళ్లపూడి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వేగేశ్వరపురంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా గోదావరి మేరీమాత ఆలయంలో ఫాదర్‌జాన్ ఆధ్వర్యంలో ఆయనకు సాదరంగా స్వాగతం పలికి ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆశీర్వదించారు. అనంతరం జవహర్ మాట్లాడుతూ ఎస్సీలు తమకు అన్యాయం జరిగిందని భావిస్తే రాజధాని అమరావతిలో తన కార్యాలయంలో ప్రతి మంగళ, బుధవారం అర్జీలు తీసుకుంటామని, అలాగే ప్రతి గురు, శుక్రవా రాల్లో తనకు అందిన ఫిర్యాదులపై సమీక్ష ఉంటుందన్నారు. ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా తాను ఎప్పుడూ దళితులకు అందుబాటులో ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో ఆత్కూరు రాంబాబు, కొత్తపల్లి ఆశిష్‌లాల్, నామా సురేంద్ర కుమార్, కొప్పాక నరసయ్య, మెరిపో వెంకట్రావు, కలిశెట్టి సన్యాసినాయుడు, తిగిరిపల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

బంగారయ్య కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వేగేశ్వరపురం గ్రామానికి చెందిన ప్రముఖ టీడీపీ నేత కైగాల బంగారయ్య, కైగాల శ్రీనివాసు మాతృమూర్తి రత్తమ్మ ఇటీవల స్వర్గస్తుల య్యారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆ కుటుంబాన్ని శనివారం వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో భాగంగా రత్తమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, సూరపనేని చిన్ని, మండల టీడీపీ అధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, కోడి శంకరం, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలులో రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమం


పట్టణంలో జరిగిన ఉద్యమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నిడదవోలు, జూన్14 (ఆంధ్రజ్యోతి): గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన విధానాలకు విరుద్ధంగా ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ, ఓబీసీలకు ఉన్న రిజర్వేషన్ చట్టాన్ని కూల్చివేయడానికి కుట్ర పన్నుతోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీజే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శనివారం నిడదవోలు పట్టణంలోని ఆర్వోబీ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య సంరక్షణ రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్టిన్ లూథర్, నియోజకవర్గ కోఆర్డినేటర్ సారిక వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు మేడవరపు భద్రం దొర, చిన్నం మురళీకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు

ఉండ్రాజవరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తాడిపర్రుకి చెందిన మోటుపల్లి ప్రసాద్ ఏపీ ఈసెట్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 11వ ర్యాంకు సాధించాడు. ఆయన తండ్రి మోటుపల్లి ఆంజనేయులు సైకిల్ మెకానిక్, తల్లి సూర్యకుమారి గృహిణి. ప్రసాద్ మాట్లాడుతూ వ్యవసాయ విభాగంలో ఇంజనీర్ అయ్యి, రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు కృషిచేస్తానన్నాడు. అత్యుత్తమ ర్యాంకు సాధించడం పట్ల గ్రామ పెద్దలు అభినందించారు.

విద్యలో విప్లవాత్మకమైన మార్పులు

- ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు
- చిన్నాయిగూడెంలో తల్లికి వందనం అభినందన సభ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, తదితరులు

దేవరపల్లి, జూన్14 (ఆంధ్రజ్యోతి): విద్యలో మంత్రి నారా లోకేశ్ విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. చిన్నాయిగూడెంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గడా మురళీ అజిత్‌కుమార్ ఇంటి వద్ద శుక్రవారం తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా ముగ్గురు పిల్లలు ఉన్న తల్లిదండ్రులకు డబ్బులుపడిన సందర్భంగా వారితో అభినందన సభను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ మన రాష్ట్రంలో ఎక్కువ కుటుంబాలు వ్యవసాయ రంగం పై ఆధారపడి ఉన్నాయని, అలాగే బడుగు, బలహీన వర్గాల వారు కూడా ఎక్కువగా ఉన్నారని, వారి పిల్లలు ఆర్థికభారంతో చదువు మానకూడదనే ఉద్దేశంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఆలోచన చేసి ఎంతమంది ఉన్నా.. ఒక్కొక్కరికి రూ.13 వేలు చొప్పున వెయ్యాలని నిర్ణయం తీసుకోవడం చారిత్రాత్మకమైన చర్య అన్నారు. నియోజకవర్గంలో మొత్తం 34,990 మంది విద్యార్థులకు రూ. 45 కోట్ల 50 లక్షల నగదు వారి తల్లుల ఖాతాలో జమ అయ్యిందన్నారు. ఎన్నికల హామీలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఒక్కొక్కటిగా నెరవేస్తుంటే సైకో జగన్ ప్రభుత్వాన్ని విమర్శించటం తగదన్నారు. వైసీపీలో గౌరవ అధ్యక్షురాలిగా ఉన్న తల్లినే ఆ పదవి నుంచి తొలగించిన జగన్ తల్లికి వందనం పథకంపై విమర్శలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం చిన్నాయిగూడెంలో 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ.10వేలు చొప్పున గడా మురళీ అజిత్‌కుమార్, పిన్నమనేని సత్యనారాయణ, చిలకా రాజేశ్ అందజేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రూ అనిల్, మండలాల అధ్యక్షుడు లంకా సత్యనారాయణ, టీ.సత్యనారాయణ, రొంగల సత్యనారాయణ, టీడీపీ నాయకులు, ముమ్మిడి సత్యనారాయణ, బల్లా సూర్యచక్రం, ఆచంట రామారావు, కొయ్యలమూడి చినబాబు, గన్నమని హరికృష్ణ, కొయ్యలమూడి సుధారాణి, బ్రహ్మరాజు, తదితరులు పాల్గొన్నారు. దేవరపల్లి గ్రామానికి చెందిన కాకి నాగేశ్వరరావు మాట్లాడుతూ తన ముగ్గురు పిల్లలకూ రూ.39 వేలు పడిందని, మా పిల్లలను కార్పొరేట్ స్కూల్‌లో చదివిస్తున్నానని చెప్పారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

కొంకుదురులో సినిమా షూటింగ్

బిక్కవోలు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కొంకుదురు బుడతలమామిడి పరిసర ప్రాంతాల్లో నూతన చిత్ర నిర్మాణ సంస్థ నిర్మిస్తున్న ఇంకా పేరు పెట్టని చిత్రం షూటింగ్ శనివారం జరిగింది. క్యారెక్టర్ నటుడు అజయ్‌ఘోష్, నూతన హీరో తిరువీర్ తదితరులపై తుల్యభాగలో స్నానాలు చేస్తున్న సన్నివేశాలను చిత్రీకరించారు. హీరోయిన్‌గా పాయల్, అజయ్‌ఘోష్, రఘుబాబు నటిస్తున్నారు. నరేష్ దర్శకత్వం వహిస్తున్నారు.

శ్రీవారి అన్నదాన ట్రస్ట్‌కు విరాళం అందజేత


దేవస్థానం అధికారులకు బాండు రూపంలో విరాళం అందిస్తున్న దృశ్యం

నల్లజర్ల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ద్వారకా తిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయ నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఆవపాడుకి చెందిన అచ్యుత గోపాలం, శేషవేణి దంపతులు వారి కుమారుడు జ్ఞాన వెంకటసాయి కలిసి రూ.35,348 నగదును విరాళంగా ఆలయ అధికారులకు శనివారం బాండు రూపంలో అందజేశారు. వారిని ఆలయ కమిటీ అభినందించింది. కార్యక్రమంలో అచ్యుత కల్కిమూర్తి, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



పడి ఉన్న సమ్మక్క మృతదేహం

దేవరపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అత్తాఅల్లుడు రాజమహేంద్రవరం ఆసుపత్రికి వెళ్లి తిరిగి వస్తుండగా దుద్దుకూరు జాతీయ రహదారి ఫ్లైఓవర్ పై ఎదురుగా వెళ్తున్న లారీని మోటార్‌సైకిల్ ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలి... కొయ్యలగూడెంకి చెందిన దాసరి శివ అత్త జగన్నాథ సమ్మక్క (53) రాజమహేంద్రవరం ఆసుపత్రికి వెళ్లి స్వగ్రామం కొయ్యలగూడెం వెళ్తుండగా మార్గమధ్యలో ఎదురుగా వెళ్తున్న లారీని మోటార్‌సైకిల్ వేగంగా ఢీకొనడంతో దాసరి శివకు, సమ్మక్కకు తీవ్రగాయాలయ్యాయి, దీంతో 108 వాహనంలో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా సమ్మక్క చికిత్స పొందుతూ మృతిచెందినట్టు తెలిపారు. శివను మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశారు.

వెంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న పోలిశెట్టి వెంకన్నబాబు దంపతులు

దేవరపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి దేవరపల్లికి చెందిన పోలిశెట్టి వెంకన్నబాబు, సునీత దంపతులు రూ.లక్ష విరాళాన్ని శనివారం ఆలయ కమిటీ సభ్యుడు యాగంటి శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గుడ్ల వెంకటేశ్వరరావు, కొండపల్లి సత్యనారాయణ, ఆలయ అర్చకుడు దుర్గాప్రసాద్ ఆచార్యుడు, తదితరులు పాల్గొన్నారు.

యోగాను జీవితంలో ... ఒక భాగం చేసుకోవాలి : చైర్మన్


రోటరీ ఆడిటోరియంలో యోగాసనాలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్, అధికారులు

నిడదవోలు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యోగాను జీవితంలో ఒక భాగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని రోటరీ ఆడిటోరియంలో ఫ్రీ యోగా డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీన జరగబోయే యోగాంధ్రలో భాగంగా యోగాపై విస్తృత ప్రచారం కల్పించే దిశగా రాష్ట్రప్రభుత్వం యోగాకు విశేష ప్రచారం కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, తహశీల్దార్ బి.నాగ రాజు నాయక్, పలుశాఖల అధికారులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం


అగ్నికి ఆహుతవుతున్న ఇల్లు

కొవ్వూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 4వ వార్డు మెరకవీధి లూథరన్ చర్చి ఎదురుగా ఉన్న రెండు వాటాల తాటాకిల్లులో శనివారం రాత్రి ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. ఇప్పర్తి సుబ్బాయమ్మ, ఆమె పెద్దకొడుకు ఇప్పర్తి విఘ్నేశ్వరరావు రెండువాటలలో వేరువేరుగా ఉంటారు. శనివారం రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో మంటలు చెలరేగాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపకశాఖ అధికారి ఏవీఎస్ఎన్ వేణు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని, ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను అదుపుచేశారు. అప్పటికే ఇల్లు మొత్తం కాలిపోయింది. సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం సంబవించిందని ఫైర్ అధికారులు అంచనా వేస్తున్నారు.

యోగాంధ్రలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి : శేషారావు


వేలివెన్నులో యోగాసనాలు వేస్తున్న చైర్మన్ శేషారావు, తదితరులు

ఉండ్రాజవరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు అన్నారు. శనివారం వేలివెన్నులో జరిగిన యోగాంధ్ర-2025 మాక్‌డ్రిల్‌లో ఆయన పాల్గొని మాట్లాడుతూ యోగా వల్ల శారీరక, మానసిక ప్రశాంతత వస్తుందన్నారు. అలాగే ఈనెల 21 తేదీన విశాఖపట్నంలో జరిగే యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో వీఎస్ రామారావు, డిప్యూటీ ఎంపీడీవో ఆంజనేయశర్మ, మండల స్థాయి అధికారులు,సచివాలయ సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

చాగల్లు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, ఆనందకరమైన జీవితం రెండూ సాధ్యపడతాయని తహశీల్దార్ ఎం. మెరికమ్మ అన్నారు. శనివారం స్థానిక జడ్పీ హైస్కూల్లో యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు విద్యార్థులు, గ్రామప్రజలు పాల్గొని సాధన చేశారు. అలాగే ఎంపీడీవో ఆర్.శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర పేరుతో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో సుభాకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి. పద్మావతి, జి. శిరీష, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


చాగల్లు హైస్కూల్లో యోగాసనాలు వేస్తున్న అధికారులు

దేవరపల్లి: ప్రతిఒక్కరి జీవన విధానంలో యోగా ఒక భాగం కావాలని టీడీపీ నాయకులు సుంకర దుర్గారావు, గన్నమని హరికృష్ణ, ఉప్పులూరి రాంబాబు పేర్కొన్నారు. దేవరపల్లి జడ్పీ హైస్కూల్‌లో శనివారం అంబటి సత్యనారాయణరావు, వివిధ శాఖలకు చెందిన అధికారులు యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఈటీ నాగరాజు యోగా క్లాసును నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ప్రసాద్, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, డ్వాక్రా మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రను జయప్రదం చేద్దాం

నల్లజర్ల: ఈనెల 21 జరిగే యోగాంధ్ర కార్యక్రమాన్ని గ్రామ ప్రజలంతా కలిసి జయప్రదం చేయాలని పంచాయతీ కార్యదర్శి రామారావు, వీఆర్వో అరుగోలు సునీత పిలుపునిచ్చారు. శనివారం చీపురు గూడెం ప్రాథమిక పాఠశాలలో శనివారం యోగా మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు చెల్లు పెద్దరామన్న, సీనియర్ నాయకుడు కూసంపూడి వెంకటేశ్వర రావు (బుజ్జి), జనసేన పార్టీ మండల అధ్యక్షుడు జీ. వరుణ్‌కుమార్, మండల కార్యదర్శులు కొత్తపల్లి హరిబాబు, చెల్లు సత్యనారాయణ, చెల్లు నాయుడు, అంగన్‌వాడీ, ఆశ, ఏఎన్‌ఎంలు , తదితరులు పాల్గొన్నారు.



చీపురుగూడెంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రక్తదానంపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శనివారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. యూత్ రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ జి.రవితేజ రెడ్‌క్రాస్ వలంటీర్లతో ప్రభుత్వ బోధనాసుపత్రి బ్లడ్‌బ్యాంకు వారి సమన్వయంతో దీన్ని చేపట్టారు. అనంతరం మానవహారం నిర్వహించారు. పలువురు రక్తదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే, ప్రభుత్వ బోధనాసుపత్రి వైద్యులు డాక్టర్ సుజాత, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కళాశాల మైదానంలో యోగా ట్రయల్‌రన్ నిర్వహించారు. ఆర్డీవో కృష్ణనాయక్ ముఖ్య అతిథిగా విచ్చేసి యోగాసనాల వచ్చే లాభాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే, వివిధ కళాశాలల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మెంబర్ డాక్టర్ జీఎస్ మహాలక్ష్మి రెడ్‌క్రాస్ వలంటీర్ల విధివిధానాలు, రక్తదానంతో ప్రాణాలు పోయడం మనిషికి ఎంత సంతృప్తినిస్తుందో వివరించారు. ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్‌వీ గంగిరెడ్డి మాట్లాడుతూ తమ విద్యాసంస్థల్లో ఏ క్షణమైనా రక్తదానం చేయడానికి వలంటీర్లు సిద్ధంగా ఉంటారన్నారు. డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రాంబాబు రక్తదానానికి సంబంధించిన పలు విషయాలను వివరించారు. సందర్భంగా 67 సార్లు రక్తదానం చేసిన జీవీఎస్ నాగేశ్వరరావుకు ధన్వంతరీ బ్లడ్ బ్యాంకు డాక్టర్ కె.శ్రీనివాసమూర్తి జ్ఞాపిక అందించారు.

ప్రమాదాలు జరుగుతున్నా.. పట్టించుకోరా ..?

- నిడదవోలులో సర్వీసు రోడ్డు నిర్మాణం చేపట్టని కాంట్రాక్టర్ .. మంత్రి ఆదేశాలు భేఖాతర్
- గాంధీబొమ్మ సెంటర్ వద్ద స్థానికులు, వర్తకుల ధర్నా


నిడదవోలు గాంధీబొమ్మ సెంటర్‌లో ధర్నా చేస్తున్న స్థానికులు

నిడదవోలు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్ నుంచి రైల్వేగేటు వరకు నిర్మిస్తున్న ఆర్వోబీ కారణంగా స్థానిక ప్రజలు, వర్తకులు అనేక ప్రమాదాల బారినపడుతున్నారు. అయినప్పటికీ సంబంధిత కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు అవేమీ పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారని పట్టణ జనసేన పార్టీ అధ్యక్షుడు రంగా రమేష్ ఆరోపించారు. ఈమేరకు శనివారం గాంధీబొమ్మ సెంటర్‌లో ప్రజలు, స్థానిక వర్తకులు కలిసి ధర్నా నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన మాట్లాడుతూ సాక్షాత్తూ స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కందుల దుర్గేష్ స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా సర్వీసురోడ్డు నిర్మించాలని ఆదేశించినా... కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ముఖ్యంగా రాజమండ్రి నుంచి తాడేపల్లిగూడెం వైపునకు వెళ్లే చిన్న వాహనాలు మొదలుకొని భారీ వాహనాలకు వరకు ఇదే ప్రధాన మార్గం. ఇకనైనా కాంట్రాక్టర్ తక్షణమే స్పందించి సర్వీసు రోడ్డు నిర్మించకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు, స్థానిక వ్యాపారులు, జనసేన నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పల్లాను పరామర్శించిన శేషారావు


సింహాచలం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శేషారావు

ఉండ్రాజవరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తండ్రి పల్లా సింహాచలం ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు శనివారం విశాఖపట్నం వెళ్లి శ్రీనివాసరావును పరామర్శించారు. అనంతరం సింహాచలం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నియోజకవర్గ టీడీపీ నాయకులు, తదితరులు ఉన్నారు.